MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 21 సంచిక: 12 రంగారెడ్డి ఆగస్టు 2023 పేజీలు : 36 వెల : రూ. 10/-

## నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవం



తెలంగాణా ఆర్ ఓ ప్రచురణలను ఆవిష్కరించిన రాష్ట్ర గవర్నర్ శ్రీమతి తమిళసై సౌందరరాజన్ తో, సి జి ఎం శ్రీమతి సుజాత చింతల, ఎస్ బి ఐ డిప్యూటి ఎండి శ్రీ అమిత్ జింగ్రాన్

## ఏపిమాస్ 22 వ వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన

## మళ్ళీ వచ్చేసింది ... !

ఉత్తమోత్తమ ఎస్ హెచ్ జి సమాఖ్యలను సన్మానించే


ఏపిమాస్, ఎనేబుల్ ఆధ్వర్యంలో

జాతీయ స్థాయి సంరంభం!

2023 అక్టోబర్ 10, 11 తేదీలలో ...

(వివరాలు 7వ పేజీలో)

## టమాటో విశ్వరూపం ! వంకాయ కాదు, టమాటోనే !





రికార్డు స్థాయి ధరలతో టమాటో విప్లవం !

ఈ నల్ల టమాటో రైతులకు సిరులు కురిపిస్తుంది ! !

## ఎస్ బి ఐ ముంబై ప్రతినిధులతో చర్చలు !



సి జి ఎం శ్రీ శంతను, జి ఎం శ్రీ యోగేంద్రలతో ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి బృందం చర్చలు

## పిహెచ్ డి సాధించిన శ్రామిక మహిళ !



సాకె భారతి

## 'జై కిసాన్'కు అరబిందో సదుపాయాలు !



సభలో ప్రసంగిస్తున్న మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శ్రీమతి సునీతారెడ్డి ... ఎంఎల్ ఏ శ్రీ మదన్‌రెడ్డి , శ్రీ సి ఎస్ రెడ్డి ప్రభృతులు


NABARD

నాబార్డ్ సౌజన్యంతో ....

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత

సంపుటి 21 సంచిక 12




సంపాదకీయం

## టమాట !

**ట**మాట ... ఇప్పుడు ఎవరినోట విన్నా యిదే మాట! టమాట విజృంభించింది, తిరగబడింది, విప్లవం సాగిస్తున్నది! దాదాపు గత నెలన్నరగా టమాట వార్తలలో నిలుస్తున్నది. రోజుకో కొత్త కబురు చెబుతున్నది. కొద్దిమందికి మోదాన్ని , పలువురికి ఖేదాన్ని మిగులుస్తున్నా, తన విలువేమిటో ప్రపంచానికి చాటి చెబుతున్నది. గతంలో కూడా మంచి పంట సీజన్లో టమాట వార్తలలో నిలవకపోలేదు. అయితే, ఆ వార్తలు, యిప్పటి వార్తలకు పూర్తి భిన్నం, విరుద్ధం. టమాట ధర బొత్తిగా పడిపోయిందని, కొనేవారు లేక, మార్కెట్‌కు తీసుకువెడదామంటే కోత కూలీలు కూడా రావని, కోయకుండా పొలాల్లోనే పశువులు తినడానికి వదిలివేశారని, దిగుబడి బాగా వస్తున్నదని సంబరపడిన రైతు, ధరలేక లబోదిబోమంటున్నాడనేవి అప్పటి వార్తలు. ప్రతి ఏడాది అవే విషాద, విచార వార్తలు! ఇప్పుడు పరిస్థితి ఒక్కసారిగా తారుమారైంది. 'ఇంతింతై వటుడింతై' అన్నట్టు టమాట ధర రోజురోజుకు పెరిగిపోతూనే వున్నది. కిలో 5 రూపాయలకు కూడా కొనని ఒకనాటి దుస్థితి నుంచి టోకు మార్కెట్‌లోనే కిలో 100 నుంచి 200 రూపాయలకు పైగా పలుకుతూ, అందరినీ అశ్చర్యానికి గురిచేస్తున్నది. టమాట పండించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానం, ప్రపంచంలో రెండవ స్థానంలో నిలుస్తున్నది. రెండవ తెలుగు రాష్ట్రమైన తెలంగాణా కూడా టమాట పంటలో దేశంలో ఏడవ స్థానంలో వున్నది. ఈ గణాంకాలు మన రెండు తెలుగు రాష్ట్రాలు టమాటా పంటకు ఎంత కీలకమో వివరిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి టమాట మార్కెట్ మొత్తం ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరుపొందింది. ఆ మదనపల్లి మార్కెట్‌లో జులై 29 వ తేదీన ఆ మార్కెట్ 45 ఏళ్ళ చరిత్రలో ఎన్నడూ లేనంతగా, 25 కిలోల టమాట బాక్స్ ధర 5,200 రూపాయలు పలికిందట! అంటే కిలో 208 రూపాయలు! ఇక సాధారణ మార్కెట్లలో కిలో 230 నుంచి 250 రూపాయల వరకు విక్రయిస్తున్నారట! అంటే, కిలోకు ఒక మోస్తరు పరిమాణం కలిగిన టమాటాలు 15 వస్తాయనుకుంటే, ఒక్కొక్క టమాట ఖరీదు 18 రూపాయలన్నమాట! ఒక మోస్తరు మామిడి పండు కంటె, యాపిల్ పండు కంటె కూడా ఎక్కువ! ఇది సామాన్యులకు పెనుభారమనడంలో సందేహం లేదు. ఇంతటి ధర చెల్లించి అయినా కొందరు కొంటున్నారంటే అది టమాట గొప్పతనం. పోషక విలువలతోపాటు ఏ వంటలోనైనా ఒదిగిపోగలగడం, ఆ పదార్థానికి రుచిని పెంచడం టమాట ప్రత్యేకత! అన్ని వాణిజ్య ఉత్పత్తుల ధరలను అమ్మకందారు నిర్ణయిస్తుంటే, వ్యవసాయ ఉత్పత్తుల ధరలను మాత్రం దళారీలు నిర్దేశిస్తారు. వారు ఎంతంటే అంతకు అమ్మవలసిందే. టమాట యిప్పుడు, దళారీలను సైతం తోసిరాజని, తన ధరను తానే నిర్ణయించుకునే పరిస్థితి రావడం రైతు శ్రేయోభిలాషులకు సంతోషదాయకమైన విషయమే. అయితే, యిది కొద్దికాలపు ముచ్చటగానే మిగిలిపోతుంది. అకాల వర్షాలకు పంట దెబ్బతిని, దిగుబడులు లేక, గిరాకీకి తగినంత సరుకు అందక వచ్చిన తాత్కాలికమైన ఊపు యిది. కొందరు రైతులు ఈ కొద్ది రోజులలోనే లక్షలు, కోట్లు ఆర్జించినట్టు వార్తలు వస్తున్నాయి. సంతోషించవలసిన విషయమే. అయితే, రైతు సంస్థలు, ప్రభుత్వాలు ఊహించని ఈ ధర పెరుగుదలనుంచి పాఠాలు నేర్చుకుని, కనీసం ఊహించే స్థాయిలో రైతుకు ఎప్పుడూ తగినంత ధర లభించేలా జాగ్రత్త వహించడం అవసరం. ఇటు రైతు సంక్షేమం, అటు సామాజిక బాధ్యత నెరవేరేలా ప్రభుత్వాలు కృషి చేయాలి. అవగాహనా రాహిత్యం వల్లనో, సకాలంలో మేలుకోలేకనో, లేక రాజకీయ కారణాల వల్లనో రైతుతో, వ్యవసాయ రంగంతో ప్రభుత్వాలు చెడుగుడు ఆడుకుంటుంటాయి. వరి ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయని, ఐదేళ్ళకు సరిపడా వున్నాయని, వరిసాగును నిరుత్సాహ పరచిన భారత ప్రభుత్వం, బియ్యం ధరలను అదుపు చేయడానికంటూ బియ్యం ఎగుమతులను నిషేధించింది. ఇప్పుడు బియ్యం దొరకక విదేశాలలలోని, ముఖ్యంగా మన దక్షిణాది రాష్ట్రాలవారు లబోదిబో మంటున్నారు. అంత భారీగా నిల్వలు వుంటే విదేశాలకు సరఫరా చేయవచ్చుకదా! పోనీ మన దేశంలోనైనా బియ్యంధరలు పెరగడం ఆగిందా అంటే అదీ లేదు. మరి ఎందుకీ అనాలోచిత నిర్ణయం? టమాట ధర విషయంలోకూడా యిలాంటి ఏదో ఒక తొందరపాటు నిర్ణయం కాకుండా, ఉభయతారకమైన చర్యలు అవసరం.


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**


ఆయినవారి మౌనం గుండెల్లో గునపం , అందుకే మాటామంతీ కొనసాగిస్తుండాలి

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. కృష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు


## లోపలి పేజీలలో ....


- 22వ వార్షికోత్సవం ...భవ్య భవిష్యత్ దర్శనం! ...05
- ఎస్‌హెచ్‌జి లకు జాతీయ పురస్కారాలు.. ...07
- ఎఫ్‌పిసిగా మొదలై, 125 ఎఫ్‌పిసి లు ...! ...08
- నాబార్డ్ 42వ వ్యవస్థాపక దినోత్సవం! ...10
- బొట్టుపెట్టు ...పత్తిలో గులాబీపురుగు పనిపట్టు! ...12
- పీలేరులో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ...13
- 'జై కిసాన్' ఎఫ్‌పిఓలో సదుపాయాలు ! ...14
- రోజూ కూలీకి వెడుతూనే పిహెచ్ డి సాధించింది!...16
- నల్ల టమాటాల సాగుతో భారీ లాభాలు! ...17
- చిత్రవిచిత్రాలు చేయిస్తున్న టమాటా ! ...18
- టమాటా లారీని ఎత్తుకెళ్ళారు...దొరికిపోయారు! ...20
- ఎఫ్ పి ఓ లే రైతన్నకు బలం, బలగం ! ...21
- చిరుధాన్యాల విత్తనాల సద్వినియోగం ...23
- ఆహారాన్ని అద్భుతంగా నిల్వచేసే 'అరేడియేషన్' ...24
- చిరుధాన్యాల అంజమ్మకు ఐక్యరాజ్యసమితి జోహార్ ...25
- నవజాత శిశువుల ఆకలి తీర్చిన అమ్మకు గిన్నిస్...26
- 'చంద్రయాన్' లో మహిళాయాన్! ...27
- శ్రీజ మిల్క్ డైరీ 10వ వార్షికోత్సవ సంబరాలు ...29
- ఎఫ్ పి ఓల సుస్థిరతకు శ్రీ సి ఎస్ సూచనలు ...30
- ఉద్యోగినులు లక్ష్యంగా తల్లిపాల వారోత్సవాలు ...31
- బిడ్డలకు పాలిచ్చే గదుల ఏర్పాటుకోసం.... ...33


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


ఆశాభావం అన్నిటినీ అనుకూలంగా మార్చే మంత్రదండం కాదు, దేనికైనా నిన్ను సిద్ధంచేసే మనోబలం !

# 22 వ వార్షికోత్సవం ... భవ్య భవిష్యత్ దర్శనం!



**అ**భివృద్ధి రంగంలో 22ఏళ్ళుగా విశిష్టమైన సేవలను అందిస్తూ, నాణ్యతా ప్రమాణాలకు, విలువలకు, ఫలితాల సాధనకు అత్యంత విశ్వస నీయ సంస్థగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పేరు ప్రఖ్యాతులను సాధించిన ఏపిమాస్, 2023 జూన్ 30, జులై 1 తేదీలలో రెండు రోజుల పాటు 22 వ వార్షికోత్సవాలను పాతకొత్తల మేలు కలయికగా నిర్వహించుకున్నది. గతాన్ని, వర్తమానాన్ని సమీక్షించి, భవ్యమైన భవిష్యత్తుకు సర్వసన్నద్ధంగా నిలిచింది.

మొదటి రోజు జూన్ 30న కార్యక్రమాలు హైదరాబాద్ ఐ ఐ టి డైరెక్టర్ డాక్టర్ బి.ఎస్. మూర్తి స్ఫూర్తిదాయక ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. అనంతరం ఆ రోజంతా, ఏపిమాస్ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టులపై సమీక్షలతో సాగింది.

అభివృద్ధిరంగ ప్రతినిధులుగా, ప్రతి ఒక్కరూ నిర్దేశించు కున్న లక్ష్యాలను సాధించి తీరాలన్న దృఢ సంకల్పం కలిగి వుండాలని, సంస్థ ఆశయాలకు, ఆశయసాధన మార్గానికి కట్టుబడి పనిచేసి, అంకితభావంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని డాక్టర్ బిఎస్ మూర్తి పేర్కొన్నారు. ఎన్ని సవాళ్ళు, అడ్డంకులు ఎదురైనా, చెదరని ఆశతో , దృఢ సంకల్పంతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చునని ఆయన హితవు పలికారు.

సంస్థ ఆశయాలను నెరవేర్చుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, జవాబుదారీతనంతో వ్యవహరించాలని డాక్టర్ మూర్తి అన్నారు.

హైదరాబాద్ ఐ ఐ టి కేవలం విద్యాబోధనే కాకుండా కొన్ని సామాజిక ప్రయోజనదాయక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నదని, గ్రామాలలో వ్యర్థాలను వర్గీకరించడం, వ్యర్థాలనుంచి వెర్మి కంపోస్ట్ తయారీ, బయో గ్యాస్ తయారీ వంటి కార్యక్రమాలను చేపడుతున్నదని ఆయన తెలిపారు.

సర్వోదయ అనే ఎన్ జి ఓకు పప్పుధాన్యాల ఉత్పత్తుల తయారీ, వ్యర్థాల నుంచి వివిధ ఉత్పత్తుల తయారీలో అండదండలు అందిస్తున్నదని డాక్టర్ మూర్తి వివరించారు, ఏపిమాస్ సిబ్బంది హైదరాబాద్ ఐఐటిని సందర్శించి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను స్వయంగా చూడాలని డాక్టర్ మూర్తి ఆహ్వానించారు. హైదరాబాద్ ఐఐటి,ఏపిమాస్ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకోవచ్చునని కూడా ఆయన సూచించారు.

అనంతరం, ఏపిమాస్ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టుల స్థితిగతులు, ప్రగతి గురించి ఆ ప్రాజెక్టుల బాధ్యులు వివరించారు.

ఏపిమాస్ పాలకవర్గ సభ్యులు శ్రీ ఎన్ వి రమణ 'ఎఫ్ పి ఓలు తమ వ్యాపారాన్ని పెంపొందించుకోవడంలో పాటించవలసిన ఉత్పత్తుల విలువపెంపు, మార్కెటింగ్ వ్యూహాల ప్రాధాన్యాన్ని వివరించారు. దీనితోపాటు ఏపిమాస్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై శ్రీ కె శ్రీనివాస్, శ్రీమతి భవాని, శ్రీ బ్రహ్మచారి, శ్రీ దేవన్, శ్రీ రమేష్‌బాబు సమాంతర ఉప సదస్సులను నిర్వహించారు.

ఏపిమాస్ సి ఇ ఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డితోపాటు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి, లీడ్ కన్సల్టెంట్లు శ్రీమతి కళామణి, శ్రీమతి రామలక్ష్మి , ప్రధాన కార్యాలయం నుంచి, అన్ని ప్రాంతీయ కార్యాలయాలనుంచి ప్రాజెక్ట్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో వార్షికోత్సవాల తొలిరోజు ముగిసింది.

**రెండవ రోజు**

వార్షికోత్సవాల ప్రారంభ సూచకంగా జ్యోతి ప్రజ్వలనతో పాటు, సిబ్బంది సామూహిక ఆత్మీయ కరబంధంతో రెండవరోజు కార్యక్రమాలు మొదలైనాయి.

తొలుత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి వార్షికోత్సవాలలో పాల్గొంటున్న వారందరినీ అభినందిస్తూ,



చూశానని, ఆ ఉద్యమం మహిళల ఆత్మవిశ్వాసాన్ని గణనీయంగా పెంచిందని అన్నారు. ఇప్పుడు స్వయం సహాయ మహిళలు మరింత గొప్ప కార్యక్రమాలు చేపట్టే శక్తిసామర్థ్యాలను కలిగివున్నారని, వివిధ రంగాలలో వారి ప్రాతినిధ్యం వుంటుండడంపట్ల హర్షం వ్యక్తం చేశారు.

వేడుకలకు ఆహ్వానిస్తూ క్లుప్తంగా ప్రసంగించారు.

శ్రీ సి ఎస్ రెడ్డి మనం చేపట్టే ఏ కార్యక్రమంలోనైనా గణనీయమైన ప్రభావాన్ని, ప్రయోజనాన్ని చూపాలంటే, సాధారణ ధోరణులకు భిన్నంగా వినూత్న ఆలోచనలు, ఆచరణ విధానాలు అవసరమని, సమాజంతో గాఢమైన అనుబంధం వుంటేనే పోషకాహారం, రక్తహీనత వంటి కీలక అంశాలపై మనం నిర్వహించే కార్యక్రమాలు ఫలప్రదమవుతాయని చెప్పారు.

ఈనాటి కార్యక్రమాలలో ఏపిమాస్ పాలకవర్గ సభ్యురాళ్ళు మహపర అలి గారు, గౌరి గారు, 'సోషల్ వెంచర్ పార్ట్నర్స్' ప్రతినిధులు పాపారావు గారు, సుబ్బారావు గారు కూడా పాల్గొన్నారు. సాయంత్రానికి ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు, పాలకవర్గ సభ్యులు శ్రీ మోహనయ్య కూడా హాజరై విలువైన సలహాలను అందజేశారు.

శ్రీమతి గౌరి శిక్షణలు, సామర్థ్యం పెంపు కార్యక్రమాల నిర్వహణలో ఏపిమాస్ ఎంతో విశిష్టమైన సేవలను అందిస్తున్నదని కొనియాడారు. శిక్షణలను సందర్భోచితంగా సమన్వయపరచుకోవడం, కార్యక్రమాల నిర్వహణలో మన అనుభవాలను, అవి చూపిన ప్రభావాన్ని గ్రంథస్తం చేయడం ముఖ్యమని ఆమె చెప్పారు.

మహపర అలి గారు మాట్లాడుతూ, మనం చేపట్టే ఏ కార్యక్రమంలోనైనా సుస్థిరత్వసాధన, మధ్యలో వదిలి వేయకుండా కడదాకా కొనసాగించడం ముఖ్యమని అన్నారు. ఒక బ్యాంక్ అధికారిణిగా స్వయంసహాయ ఉద్యమం (ఎస్ హెచ్ జి) సాధించిన అద్భుత ప్రగతిని తాను స్వయంగా

డాక్టర్ కొల్లి సుబ్బారావు ఏపిమాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు వ్యక్తుల జీవితాలలో ఎలాంటి మార్పుచేర్పులకు కారణమవుతున్నాయో, దేశ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ఎలా దోహదంచేస్తున్నాయో ఆలోచించవలసిందిగా ఏపిమాస్ సిబ్బందికి సూచించారు. ఆకలి, పేదరికాన్ని నిర్మూలించి, మన దేశం సుస్థిరాభివృద్ధిని సాధించాలంటే కేవలం ఆహారోత్పత్తి పెరిగితే సరిపోదని, ఉత్పత్తులనాణ్యత ముఖ్యమని ఆయన చెప్పారు. వాతవరణంలో మార్పుకు మనంసాగించే కృషిలో తక్షణ ఫలితాలు కనిపించకపోయినప్పటికి, యిప్పుడు ఆ కార్యక్రమాలు చేపట్టకపోతే భవిష్యత్ తరాలు భారీ మూల్యం చెల్లించుకోవలసి వుంటుందని శ్రీ సుబ్బారావు అన్నారు.

సామాజిక సంస్థగా ఏపిమాస్ సాధించిన ప్రగతిని ఏపిమాస్ సిబ్బందితో కలసి శ్రీ పాపారావు నిర్వహించారు. సమాజంలో మార్పుకు దోహదకరంగా ఏపిమాస్ సిబ్బంది/ ఏపిమాస్ సంస్థ నిర్వహిస్తున్న పాత్రను, వచ్చిన ఫలితాలను విశ్లేషిస్తూ ఈ చర్చ సాగింది.

2030 నాటికి ఏపిమాస్ నిర్దేశించుకున్న లక్ష్యసాధనలో, యిప్పుడు ఏ దశలో వున్నాం, అనుకున్న సమయానికి ఆ లక్ష్యసాధనకు యింకా ఏమిచేయాలి అనే ఆత్మపరిశీలనకు ఈ మేథోమధనం ఉపయోగపడింది.

అనంతరం సమావేశ ప్రతినిధులు మూడు బృందాలుగా విడిపోయి సాధించవలసిన ఫలితాలు, ప్రస్తుతం వాటి సాధన దశ గురించి చర్చించారు. అనంతరం, భవ్యమైన భవిష్యత్తుకు బాటలువేస్తూ, ఏపిమాస్ 22 వార్షికోత్సవాలు వేడుకగా ముగిశాయి. ■

# ఎస్ హెచ్ జి సమాఖ్యలకు జాతీయ తృతీయ పురస్కారాలు

ఏపిమాస్ సంస్థ, ఎనేబుల్ నెట్‌వర్క్ సంయుక్తంగా నాబార్డ్ తోడ్పాటుతో 2021వ సంవత్సరంలో ఎస్‌హెచ్‌జి సమాఖ్యలకు జాతీయ పురస్కారాలను ప్రవేశపెట్టాయి, భారతదేశంలో నిర్వహణపరంగా అత్యుత్తమమైన ఎస్.హెచ్.జి సమాఖ్యలను గుర్తించి, గౌరవించాలన్న లక్ష్యంతో ఈ పురస్కారాలను ఏర్పాటు చేశారు. ఆ శ్రేణిలో తృతీయ వార్షిక పురస్కారాలను 2023 అక్టోబర్ 10, 11 తేదీలలో ప్రదానం చేస్తారు. ఈ పురస్కారాలకోసం నామినేషన్లకు చివరి తేదీ 06-08-2023.

**అర్హతలు**

ఎస్.హెచ్.జి సమాఖ్యలు గ్రామీణ ప్రాంతానికి చెందినవైనా, పట్టణ ప్రాంతానికి చెందినవైనా కూడా ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హమైనవే. ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సమాఖ్యలైనా, ఎన్ జి ఓలు ఏర్పాటు చేసిన సమాఖ్యలైనా కూడా నామినేషన్లు పంపవచ్చు.

**కనీస అర్హతలు**

ఈ క్రింద పేర్కొన్న కనీస అర్హతలు వుంటే ఆ స్వయం సహాయ సమాఖ్యలు (ఎస్ హెచ్ ఫెడరేషన్లు) ఈ పురస్కారాల కోసం పరిశీలనార్హమైనవే.

- ప్రధాన భౌగోళిక ప్రాంతాలలోని సమాఖ్యలు: కనీసం 2,000 సభ్యులు లేదా 200 ఎస్ హెచ్ లను కలిగి వుండాలి.
- కొండ ప్రాంతాలు, ఐ టి డి ఏ గుర్తించిన గిరిజన ప్రాంతాలలోని సమాఖ్యలు : కనీసం 700 మంది సభ్యులు లేదా 100 ఎస్. హెచ్ జి లను కలిగి వుండాలి.
- సమాఖ్య గత మూడేళ్ళుగా తన నిర్వహణ ఖర్చులను తన సొంత నిధులతోనే భరించి వుండాలి
- సమాఖ్య రిజిస్ట్రేషన్ తేదీనుంచి కనీసం 3 సంవత్సరాలుగా పనిచేస్తూ వుండాలి.
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 లక్షల రూపాయల మేర టర్నోవర్ వుండాలి
- కనీసం 300 మంది సభ్యులైనా సంస్థ సేవలను వినియోగించుకుంటుండాలి. మరిన్నివివరాలకు ఈ క్రింది ఇ-మెయిల్ చిరునామాను సంప్రతించవచ్చు.

shgfed-awards@apmas.org ■

**ఏ స్థాయిలో ఎన్ని పురస్కారాలు ... వాటి వివరాలు**

| | | |
|---|---|---|
| జాతీయ స్థాయిలో:(03) | జాతీయ స్థాయిలో మొదటి మూడు ఎస్ హెచ్ జి సమాఖ్యలకు నగదు పురస్కారం, ధ్రువపత్రం, మెమొంటో లభిస్తాయి | మొదటి: 1,00,000 రూపాయలు<br>రెండవ: 75,000 రూపాయలు<br>మూడవ: 50,000 రూపాయలు |
| ప్రాంతీయ స్థాయిలో:(10) | ఐదు ప్రాంతీయ స్థాయిలలో (ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమం, ఈశాన్యం) ఎంపికైన మొదటి రెండు ఎస్ హెచ్ జి సమాఖ్యలకు నగదు పురస్కారం ధ్రువపత్రం, మెమొంటో లభిస్తాయి | మొదటి: 40,000 రూపాయలు<br>రెండవ: 20,000 రూపాయలు |
| ప్రత్యేక విభాగం:(01) (స్వావలంబన కలిగిన ఎస్ హెచ్ జి సమాఖ్య | ప్రత్యేక విభాగం కింద దాతృత్వ సంస్థల లేదా ప్రభుత్వ తోడ్పాటు ఏమాత్రం లేకుండా పూర్తి స్వతంత్ర నిర్వహణ కలిగిన ఎస్ హెచ్ జి సమాఖ్యకు నగదు పురస్కారం ధ్రువపత్రం, మెమొంటో లభిస్తాయి | 1,00,000 రూపాయలు |

# ఎఫ్ పి సిగా మొదలై , మరో 125 ఎఫ్ పి సిలను ఏర్పాటుచేసి ...!

## ఈ రోడ్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ విజయగాథ

- ఎస్ ప్రహ్లాద, వినాయక రెడ్డి

**చి**న్న, మధ్య తరగతి రైతులతో, ముఖ్యంగా మహిళా రైతులతో, యువ రైతులతో ఎఫ్ పి ఓలను, ఎఫ్ పి సి లను (రైతు ఉత్పత్తిదారు సంస్థలను) ఏర్పాటుచేసి, సభ్య రైతులకు కావలసిన అన్ని రకాల సేవలను ఒకే దగ్గర, తక్కువ ధరలకు అందిస్తూ, వాటిని స్వయంసమృద్ధంగా బలోపేతంచేసి, సుస్థిరాభివృద్ధి దిశగా పురోగమింపజేయాలన్న లక్ష్యంలో భాగంగా ఏపిమాస్ ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణా రాష్ట్రాలలో ఎఫ్ పి ఓలను ఏర్పాటు చేయించి, మార్గదర్శకత్వం వహిస్తున్నది.

మరోవైపు వివిధ దాతృత్వ సంస్థల తోడ్పాటుతో ఎఫ్ పి ఓల పాలకవర్గాలకు, సిబ్బందికి, సభ్య రైతులకు తమ సంస్థలను బలోపేతం చేసుకోవడానికి అవసరమైన శిక్షణలను యిస్తూ, అవగాహన పర్యటనలకు ప్రోత్స హిస్తున్నది. ఇందులో భాగంగా ఎన్.బి.ఎఫ్.సి సహాయంతో కర్ణాటక రాష్ట్రంలో చింతామణి కేంద్రంగా ఏర్పాటైన 'శ్రీ అమర నారాయణ ఎఫ్ పి సి', హెూలూరు కేంద్రంగా ఏర్పాటైన హెూలూరు ఉద్యాన రైతుల ఎఫ్ పి సి అనే రెండు ఎఫ్ పి సిల బలోపేతానికి సాంకేతిక సహాయం అందిస్తున్నది. ఈ రెండు ఎఫ్ పి సిల పాలకవర్గ సభ్యులకు జులై 20-21 తేదీలలో తమిళనాడు రాష్ట్రం, ఈరోడ్ జిల్లా శివగిరిలో ఏర్పాటై, రైతులకు కావలసిన అన్నిరకాల సేవలను సముచిత ధరలకు అందిస్తున్న 'ఈరోడ్ రైతు ఉత్పత్తిదారుల కంపెని' కార్యక్రమాలను నేరుగా తిలకించి, అవగాహన కలిగించుకోవడానికి రెండు రోజుల అవగాహన పర్యటన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.

**ఈ సందర్శనలో తెలుసుకున్న విషయాలు**

**ఇన్పుట్ మార్కెటింగ్ కార్యక్రమాలు:** ఈరోడ్ రైతు ఉత్పత్తిదారుల కంపెని తమ సభ్య రైతులకు సేవలు అందించడంతో పాటు ఇతర రైతులకు కావలసిన అన్ని రకాల ఎరువులు, క్రిమి సంహారక మందులను అమ్ము చున్నది. ఈ షాపులలో పేరు ప్రఖ్యాతులు కలిగిన కంపెనీల ఉత్పత్తులను మాత్రమే విక్రయిస్తున్నందున వ్యవసాయ నాణ్యతకు తోడ్పడుతున్నది.

**సంసాదన (ప్రాసెసింగ్) కార్యక్రమాలు :** సభ్య రైతులు పండించే రాగులు, ధనియాలు, పసుపు, నువ్వులు మొదలగు వాటిని కొనుగోలుచేసి, వాటిని గ్రేడింగ్ చేసి సంసాదన (ప్రాసెస్)చేసి, ఆ ఉత్పత్తులను తమ స్వంత షాపుల ద్వారా విక్రయిస్తున్నది. ఉదాహరణకు రైతులవద్ద నుంచి నువ్వులు, వేరుశనగ కాయలు, కొబ్బరి కాయలు కొనుగోలుచేసి, తమ స్వంత గానుగలలో నూనెతీసి స్వచ్ఛమైన నూనె, గానుగ పిండి విక్రయిస్తున్నది. అంతటా కలుషిత నూనెలు కలవరపరుస్తున్న ప్రస్తుత తరుణంలో సభ్య రైతులకు స్వచ్ఛమైన నూనె అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతున్నది. కొబ్బరి నూనెను రెండు రకాలుగా చిన్న పిల్లలకు, పెద్దలకు అనువుగా వేరువేరుగా తయారు చేస్తుండడం విశేషం.

వివిధ రకాల పప్పు ధాన్యాలను పప్పుల రూపం లోనికి మార్చి అమ్ముతున్నారు. ఈ విధమైన ప్రాసెసింగ్ ప్రక్రియల ద్వారా ముడిసరుకు రూపం మారి, విలువ పెరిగి మంచి ధరలభించడంతో పాటు, అనేకమందికి ఉపాధి లభిస్తున్నది.

**వరి విత్తన యంత్రాలు:** ఎంపిక చేసిన రైతులు పండించే వడ్లను కొనుగోలుచేసి, వాటిని శుద్ధిచేసి వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొంది, ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు పంపిస్తున్నారు. వివిధ షాపుల నుండి అందిన డిమాండ్ ఆధారంగా వరి విత్తనాలను ప్యాకింగ్‌చేసి, సరఫరాచేస్తారు. రైతులకు కావలసిన యంత్ర





పరికరాలను, ఇతర పనిముట్లను సరసమైన ధరలకు విక్రయిస్తున్నారు.

**ప్రోత్సాహక సంస్థగా 125 ఎఫ్ పి ఓల ఏర్పాటు:** 2008వ సవత్సరంలో ఏర్పాటైన ఈరోడ్ ఎఫ్ పి సి అంచెలంచెలుగా ఎదిగి, సభ్య రైతులకు అందించే సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వంచే రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో ఇలాంటి కంపెనీలను ఏర్పాటు చేయడానికి "ప్రోత్సాహక సంస్థ"గా ఎంపికైంది. ఆ గుర్తింపు ఫలితంగా ఈరోడ్ ఎఫ్ పి సి యిప్పటికి ఇతరత్రా 50 ఎఫ్ పి సిలను ఏర్పాటు చేసింది. ఇంతేకాకుండా వివిధ ఇతర పథకాల క్రింద మొత్తం 125 రైతు ఉత్పత్తి దారుల సంస్థలను ఏర్పాటు చేసి, వాటికి సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నది.

**టోకు వ్యాపారం :** ఈరోడ్ రైతు ఉత్పత్తిదారుల కంపెని ద్వారా ఏర్పాటైన 125 రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో దాదాపు 60 సంస్థలు వివిధ రకాల లైసెన్స్‌లు పొంది వ్యాపారాలు చేస్తున్నాయి. ఈ సంస్థలకు కావలసిన ఎరువులను, క్రిమిసంహారక మందులను ఈరోడ్ ఎఫ్ పి సి టోకు ధరలకు పంపిణీ చేస్తుంటుంది.

**విజయగాధ సూత్రధారి వడివేలు :** తమిళనాడు రాష్ట్రంలో ప్రఖ్యాత అభివృద్ధిరంగ నిపుణుడు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటులో విశేష అనుభవం గడించిన డాక్టర్ ఇ.వడివేలు ముందుచూపుతో 15 సంవత్సరాల క్రితమే, 2008 లో శివగిరి కేంద్రంగా ఈరోడ్ ఎఫ్ పి సి ని ఏర్పాటు చేసి, యింతటి అభివృద్ధి సాధించి, తమిళనాడు రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతలున్న కంపెనీగా ఎదిగి,125 ఇతర కంపెనీల ఏర్పాటులో కీలక భూమిక పోషించింది. ఈ విజయానికి 5 సూత్రాలు ముఖ్యమని డా. వడివేలు తెలియజేశారు.

1. రైతు ఉత్పత్తిదారు సంస్థలు చుట్టు ప్రక్కల ప్రాంతాలలోని ఇతర సంస్థల పనితీరును అధ్యయనం చేయాలి
2. రైతు ఉత్పత్తిదారు సంస్థలు తాము ఉత్పత్తి చేసే వస్తువులను ప్రభుత్వం ఏర్పాటుచేసే ఎగ్జిబిషన్స్‌లో ప్రదర్శించి, విక్రయించడంవల్ల కొంత కొనుగోలుదారుల అవసరాలను, యిష్టాయిష్టాలను తెలుసుకుని, తమ ఉత్పత్తులను మెరుగుపరచుకుని, ఆదాయం పెంపొందించుకోవడంతో పాటు, మంచి పేరు ప్రఖ్యాతులు పొందవచ్చు.
3. మొబైల్‌వ్యాన్ ఏర్పాటు చేసుకొని సంస్థ ఉత్పత్తులను పట్టణాలలోని గృహ సముదాయముల దగ్గరకు తీసుకువెళ్ళి, అమ్మకాలు చేయడం వలన సంస్థ పరపతి పెంచుకోవచ్చు.
4. డిజిటల్ మార్కెటింగ్‌తో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.
5. ఆర్థిక పారదర్శకత : సంస్థలు చేపట్టిన వివిధ కార్యక్రమాలలో ఆర్థిక పారదర్శకత వుంటే, సభ్యుల మధ్య అవగాహన, నమ్మకం పెరిగి సంస్థ చేపట్టే వివిధ కార్య క్రమాలలో సభ్యుల భాగస్వామ్యం అధికమై సంస్థ అభివృద్ధి చెందుతుంది.

ఈ క్షేత్ర సందర్శన ద్వారా శ్రీ అమర నారయణ , హొలూరు రైతు ఉత్పత్తిదారు కంపెనీల పాలక వర్గ సభ్యులు వివిధ నూతన కార్యక్రమాలను గురించి నేర్చుకొని, తమ సంస్థలలో కుడా అమలు చేయాలన్న ఉత్సాహాన్ని పొందారు. రైతు ఉత్పత్తిదారు సంస్థలు విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయి అవగాహన పర్యటనలు కూడా ప్రముఖ భూమిక పోషిస్తాయని మరోమారు నిరూపితమైంది. ■

మన మనస్సు ఒక ఆయస్కాంతం ! మంచిని తలిస్తే మంచిని, చెడును తలిస్తే చెడును అది ఆకర్షిస్తుంది

# నాబార్డ్ 42వ వ్యవస్థాపక దినోత్సవం!

## నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయంచే ఘనంగా నిర్వహణ



**2**023 జులై 16 వ తేదీన నాబార్డ్ 42 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం ఘనంగా నిర్వహించింది. తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల నాటి కార్యక్రమ ముఖ్య అతిధి, తెలంగాణా గవర్నర్ , పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కూడా అయిన డాక్టర్ (శ్రీమతి) తమిళసై సౌందరరాజన్‌ను సగౌరవంగా ఆహ్వానించారు.

ఎస్ బి ఐ డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ అమిత్ జింఘ్రాన్, నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీ ఎం ఆర్ గోపాల్ , ఎస్ ఎల్ బి సి కన్వీనర్, జనరల్ మేనేజర్ శ్రీ దేబశిష్ మిత్ర, యూనియన్ బ్యాంక్ సి జి ఎం శ్రీ కె. భాస్కరరావు, తెలంగాణా సహకార కేంద్ర బ్యాంక్ ఎం డి శ్రీ నేతి మురళీధర్, తెలంగాణా గ్రామీణ బ్యాంక్ ఛైర్ పర్సన్ శ్రీమతి వై శోభ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఛైర్మన్ శ్రీ కె ప్రతాపరెడ్డి, ఇతర బ్యాంకులు, సంస్థల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుశిక్షితులైన లంబాడీల మనోహరమైన సాంప్రదాయిక స్వాగత నృత్యంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఎఫ్ పి




ఓలు, ఓ ఎఫ్ పి ఓలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను, వ్యవసాయ నవీకరణలకు, టి డి ఎఫ్, డబ్ల్యు డి ఎఫ్, ఆర్థిక చేకూర్పు, అంకుర సంస్థలకు సంబంధించి మా విశేష కృషిని ప్రతిబింబించే స్టాల్స్‌ను గవర్నర్ గారు సందర్శించారు.

ఈ కార్యక్రమంలో గవర్నర్ గారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రజల సాధికారతకు, ఆర్థిక చేకూర్పుకు అంకితభావంతో నాబార్డ్ చేసిన విశేష కృషిని, దేశాభివృద్ధి కోసం చేసిన సేవలను కొనియాడారు. నాబార్డ్ చేపట్టిన వివిధ కార్యక్రమాలు, పథకాలు గతంలో సామాజికంగా అభివృద్ధికి నోచుకోని వర్గాల ప్రజల జీవితాలలో ఎంతో సానుకూల మార్పును తెచ్చినందుకు నాబార్డ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

అన్ని వృత్తులలలోకి వ్యవసాయం చాలా ముఖ్యమైన, ఎంతో అవసరమైన వృత్తి అని, ఆ వృత్తిని సాగించే రైతుల అభ్యున్నతికి నాబార్డ్ చేస్తున్న కృషి తనకు ఆనందం కలిగిస్తున్నదని గవర్నర్ అన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాల సాగును నాబార్డ్ ప్రోత్సహిస్తుండడం తనకు సంతోషంగా వున్నదని, తాను కూడా చిరుధాన్యాల ఉత్పత్తులను తింటానని ఆమె అన్నారు.

తోడు లేకపోతే చిన్న ప్రయాణమైనా నరకమే, మనసుకు నచ్చిన తోడుంటే నరకంలోనైనా స్వర్గమే !






నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, చారిత్రకంగా సమాజంలో అణచివేతకు గురైన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఉద్దేశించిన అభివృద్ధి లక్ష్యాల సాధనకు నాబార్డ్ చేపట్టిన వివిధ రకాల కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా వివరించారు.

సమాజ సంక్షేమానికి, పర్యావరణ పరిరక్షణకు అచంచలమైన అంకిత భావంతో నాబార్డ్ కట్టుబడి వుందని ఆమె పునరుద్ఘాటించారు. ఎస్ బి ఐ డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఆమిత్ జింగ్రాన్ రుణ ప్రణాళిక రూపకల్పన ప్రక్రియలో చురుకుగా పాల్గొన్నందుకు, లీడ్ బ్యాంక్ పాత్రకు సంబంధించిన వివిధ వేదికలలో రుణ వితరణ నిరాటంకంగా సాగడంలో కీలకపాత్ర వహించినందుకు నాబార్డ్ కృషిని కొనియాడారు. నాబార్డ్ నిరంతర కృషి ఫలితంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తి సామర్థ్యం వెలికి వస్తుందనడంలో తనకు పూర్తి నమ్మకం వుందని ఆయన అన్నారు.

తెలంగాణా రాష్ట్రంలో నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయం నిర్వహించిన వివిధ విజయవంతమైన కార్యక్రమాలను వివరించే ప్రచురణలను ఈ కార్యక్రమంలో గవర్నర్ గారు ఆవిష్కరించారు. 'శ్రీ అన్న- చిరుధాన్యాలతో మారుతున్న జీవితాలు', మహిళల ద్వారా మహిళల సాధికారత-రాబోయే మార్పును సూచించే కథానికలు, ఎఫ్ పి ఓలు – అధిరోహిస్తున్న వినూత్న శిఖరాలు, ఆర్థిక చేకూర్పు కోసం సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, ఎం ఎస్ సి లుగా పాక్స్- సామాజిక సాధికారత' అనే శీర్షికలతో వెలువరించిన ఈ చిరు పుస్తకాలు గవర్నర్ గారి మెప్పు పొందాయి. ■



గుణపాఠం నేర్పేవి తప్పులే కావు, ఏ గుణపాఠం నేర్పనిదే అసలైన తప్పు

# బొట్టుపెట్టు ... పత్తిలో గులాబీపురుగు పనిపట్టు!

– శ్రీను, రాజశేఖర (కె.వి.కె.పాలెం)

**తెల్ల** బంగారంగా పిలువబడే ప్రధాన వాణిజ్య పంట ప్రత్తి. ప్రత్తి పంటను భారతదేశంలో దాదాపుగా 123 మిలియన్ హెక్టార్లలో సాగు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా గులాబి రంగు పురుగు వలన పంట దిగుబడులు దారుణంగా తగ్గిపోవడమే కాకుండా పండిన పంటలో చాలావరకు గుడ్డి ప్రత్తి ఉండి ప్రత్తి నాణ్యతా ప్రమాణాలను దెబ్బ తీస్తుంది. దీనివలన పండిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. కొన్నిచోట్ల అయితే ఉధృతి తీవ్రరూపం దాల్చినప్పుడు రైతులు ప్రత్తి సాగు చేయడానికి ముందుకు రావడం లేదు.



ప్రస్తుతం సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించి ఈ పురుగును కొద్దివరకు అదుపు చేయవచ్చు. కానీ ఈ పురుగును పూర్తి స్థాయిలో నివారించుటకు వీలుకావడం లేదు. ఇంత క్లిష్టతరమైన సమస్యగా మారిన గులాబిరంగు పురుగును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానమైన గులాబి రంగు పురుగులో కుటుంబ నియంత్రణ అందుబాటులోకి వచ్చింది.

ప్రస్తుతం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతుల పొలాల్లో పరీక్షల స్థాయిలో ఉన్న ఈ విధానం ఇప్పటికీ కొన్నిచోట్ల మెరుగైన ఫలితాలను ఇచ్చింది. కాని ప్రత్తి సాగు చేస్తున్న రైతులందరూ సామూహికంగా ఈ విధానాన్ని పాటించినప్పుడే గులాబి రంగు పురుగును సమర్థవంతంగా అదుపు చేయవచ్చు.

**గులాబి రంగు పురుగు నివారణకు గాసిపూర్ జెల్**

- ఈ గాసిప్లూర్ జెల్ ప్రత్తి పంటలో గులాబి రంగు పురుగు నియంత్రణకు మాత్రమే నిర్దేశించబడినది.
- ఈ జెల్ కుటుంబ నియంత్రణ అనే సాంకేతిక పరిజ్ఞానంతో పని చేస్తుంది.
- ఈ జెల్ కృత్రిమంగా ఆడ పురుగు వాసన విరజిమ్ముతుంది.
- వాసన విరజిమ్ముట వలన ప్రకృతిలో సహజంగా జరిగే ఆడ మరియు మగ రెక్కలు పురుగు కలయికను అడ్డుకొని గులాబి రంగు పురుగు సంతతిని అదుపులో ఉంచుతుంది.

**సిఫారసు మరియు మోతాదు**

1. ఈ గాసిపూర్ జెల్ ఎకరంలో 400–500 మొక్కలపై చిన్న బటాని గింజ ఆకారంలో ప్రత్తి మొక్క అగ్రభాగం నుండి 10 సెంమీ కిందకి ఈనెల మధ్య భాగంలో పెట్టాలి.
2. ఈ జెల్ పంట విత్తుకున్న 30 రోజులకు, 60 రోజులకు మరియు 90 రోజుల వరకు మూడుసార్లు ప్రతి సారి 1200 మొక్కలకు పెట్టాలి.
3. ఈ జెల్ మొక్కకి మొక్కకి మధ్య 5 మీటర్లు, వరుసకి మధ్య 2 మీటర్ల దూరంలో పెట్టుకోవాలి.

**సులువైన వాడుక పద్ధతి**

1. ఈ పరిజ్ఞానం చాలా సులభమైనది మరియు ఆచరించదగినది.
2. ఒక రైతు తన పొలంలో స్వయంగా చేసుకోవచ్చు. కూలీల సమస్య ఉండదు.
3. పిచికారి అవసరం లేకుండా సులువుగా వాడుకోవచ్చు.
4. మనుషుల మీద, జంతువులు మీద ఎలాంటి దుష్ప్రభావం ఉండదు.

ఏమి అన్నావనేదానికంటె ఎలా అన్నావనేది ముఖ్యం, మనసును ఒప్పించినా నొప్పించినా అది మాటతీరే !



**గాసిప్లూర్ జెల్ యొక్క ప్రయోజనాలు**

1. గులాబీ రంగు పురుగు యాజమాన్యానికి మాత్రమే దోహదపడుతుంది. మిత్ర పురుగులు సహజ శత్రు పురుగులకు ఎలాంటి హాని కలగదు.
2. ఈ జెల్ బయోడిగ్రేడబుల్ అవడం వలన పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు.
3. ఇతర క్రిమి సంహారక తెగుళ్ళు మందులు వాడడం వలన దీని ప్రభావం తగ్గదు.
4. రైతులు సామూహికంగా వాడడం వలన మంచి



ఫలితాలు ఉంటాయి.

5. పురుగు మందుల పిచికారికి అయ్యే ఖర్చు తగ్గుతుంది.
6. గులాబి రంగు పురుగు అదుపులో ఉండడం వలన కాయపుచ్చు తగ్గి ప్రత్తి కాయలు పూర్తిగా విచ్చుకోవడం వలన నాణ్యమైన ప్రత్తిని పొందడమేగాక ప్రత్తి తీత సులువుగా ఉంటుంది.

జెల్ కావాలి అనుకుంటే సంప్రదించండి ...
పేరు : శశిధర్ బుర్ల , ఫోన్: 9811688338
Email: bsashidhar12@gmail.com

( పాలెం కృషి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో ) ■

## పీలేరులో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్

**చి**రుధాన్యాల సాగు, సాగు చేసిన రైతులకు అధిక ఆదాయం, వాటిలో విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు పీలేరులో రూ.5 కోట్ల వ్యయంతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ రాష్ట్ర అధికారి శ్రీనివాస్ తెలిపారు. పీలేరులోని అయిల్ సీడ్స్ ప్రాంగణంలో ఇదివరకే ప్రాసెసింగ్ యూనిట్ కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి దక్షిణామూర్తి, ఏపీ అర్బన్ డెవలప్మెంట్ శాఖాధికారి సతీష్‌లతో కలిసి ఇటీవల ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023ను భారత ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాల ఏడాదిగా ప్రకటించి చిరుధాన్యాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని 11 ప్రాంతాల్లో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొందించిందన్నారు. ప్రస్తుతం తాము 11 ప్రాంతాల్లోని ప్రతిపాదిత స్థలాలను పరిశీలించి ఏపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి సమగ్ర నివేదిక అందజేస్తామని.. ఆ తరువాత యూనిట్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు.

గత రెండేళ్లుగా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, ఔత్సాహిక రైతుల కారణంగా రాష్ట్రంలో చిరుధాన్యాల సాగు గణనీయంగా పెరిగిందని, ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పితే రైతులకు మార్కెటింగ్ సమస్య లేకుండా ఉంటుందన్నారు. చిరుధాన్యాలు పండించిన రైతులు తమ సమీప ప్రాసెసింగ్ యూనిట్లో విక్రయించుకోవడమే కాకుండా ఆసక్తిగలవారు వాటి ద్వారా విలువ ఆధారిక ఉత్పత్తులు కూడా తయారు చేసుకోవచ్చునన్నారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి దక్షిణామూర్తి మాట్లాడుతూ రూ 5/– కోట్లతో నెలకొల్పుతున్న యూనిట్లకు తాము ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. ■

# 'జై కిసాన్' ఎఫ్‌పిఓలో సదుపాయాలకు ప్రారంభోత్సవం!

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నర్సాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ మదన్‌రెడ్డి, తెలంగాణా రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శ్రీమతి



సునీతారెడ్డి అన్నారు. రెడ్డి ఖానాపూర్ శివారులో 'అరబిందో ఫార్మా లిమిటెడ్ ' రూ. 2 కోట్ల 40 లక్షల సిఎస్ఆర్ నిధుల వ్యయంతో ఏపిమాస్ ఆధ్వర్యంలో జై కిసాన్ వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం(ఎఫ్ పి ఓ)లో నిర్మించిన రైతు శిణ కేంద్రం, కస్టమ్ హైరింగ్ సెంటర్, గోదాంలను వారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బోర్పట్ల, రెడ్డి ఖానాపూర్ రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అరబిందో విరాళంగా జై కిసాన్ కోఆపరేటివ్ సొసైటీకి అందించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ , వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించాలన్నారు.

అనంతరం ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ, అరబిందో ఫౌండేషన్ ద్వారా ప్రతి ఏటా రూ.50 కోట్లను కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. సుస్థిరదాయక వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సాహించేందుకు జై కిసాన్‌కు ఏపిమాస్ ఎంతగానో తోడ్పాటు అందిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ శ్రీ దేవేందర్ రెడ్డి, ఎంపీపీ శ్రీ నర్సింలు, జడ్పిటిసి శ్రీ ఆంజనేయులు, కాసాల, హత్నూర పిఎసిఎస్ ఛైర్మన్లు శ్రీ దామోదర్ రెడ్డి, శ్రీ దుర్గారెడ్డి, శ్రీ శ్రీనివాసరెడ్డి, శ్రీ బుచ్చిరెడ్డి, శ్రీ కిషోర్, దౌల్తాబాద్ గ్రామ అధ్యక్షుడు అజ్మత్ అలీ, కొన్యాల సతీష్, అజీజ్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధికి అరబిందో తోడ్పాటు**

అరబిందో ఫార్మా లిమిటెడ్ దాతృత్వ, సీఎస్ఆర్ విభాగం అరబిందో ఫార్మా ఫౌండేషన్ బోరపట్లలో ఏపిమాస్ ద్వారా బోరపట్ల , రెడ్డి ఖానాపూర్ గ్రామాలలో వ్యవసాయ అభ్యున్నతికి రూ. 2.4 కోట్లతో గోడౌన్‌తో పాటు రైతు శిక్షణ కేంద్రం & కస్టమ్ హైరింగ్ సెంటర్ నిర్మాణాన్ని స్పాన్సర్ చేసింది.

బోరపట్ల గ్రామాన్ని "మోడల్ విలేజ్"గా మార్చడానికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ 2016-17 సంవత్సరంలో ఈ గ్రామాన్ని మొదట దత్తత తీసుకుంది.

ఎన్జీఓ మహిళా అభివృద్ధి సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సహకారంతో గ్రామంలో పారిశుధ్యం, మౌలిక సదు పాయాలు, సురక్షితమైన తాగునీరు అందించడం వంటి

వాటి కోసం అనేక పరిపూర్ణ, సమగ్ర గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ తెలంగాణ ప్రభుత్వ పల్లె ప్రకృతి వనం పథకం ద్వారా సామాజిక అడవుల పెంపకం వంటి ఇతర కమ్యూనిటీ - అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు, ప్రభుత్వంలోని విద్యా వాలంటీర్లకు మద్దతునిస్తూ గ్రామంలోని 700 ఎకరాల భూమికి రెండు పంటలకు నీరందించడానికి లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యాన్ని కూడా పునరుద్ధరించింది.

పాఠశాలలు, సీసీ రోడ్ల ద్వారా గ్రామంలో కనెక్టివిటీని సృష్టించడం, ఇండస్ట్రియల్ ఫైర్ సేఫ్టీ అసోసియేషన్ (ఐఎఫ్ఎస్ఎ) ద్వారా అగ్ని ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులను నిర్వహించడానికి ఫైర్ సేఫ్టీ సంసిద్ధతను మెరుగుపరచడం, మెరుగైన చెత్త పికప్ వాహనాలు, ట్రాక్టర్‌ను అందించడం ద్వారా గ్రామంలో ఆరోగ్యకరమైన వాతా వరణాన్ని సృష్టించడం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రామంలోని గాలి నాణ్యత, పర్యావరణాన్ని మెరుగుపరచ డానికి గ్రామం చుట్టూ వివిధ మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను కూడా అరబిందో ఫార్మా ఫౌండేషన్ చేపట్టింది. అగ్రికల్చర్ ప్రొడ్యూసర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఈ రెండు గ్రామాల నుండి సుమారు 1,750 మంది రైతులకు మద్దతుగా తెలంగాణ పరస్పర సహాయ సహకార సంఘాల చట్టం క్రింద నమోదు చేయబడింది.

**సదుపాయాల వివరాలు**

ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సంస్థాగత సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, అరబిందో ఫార్మా ఫౌండేషన్ 1.5 ఎకరాల ప్రభుత్వం కేటాయించిన స్థలంలో గోడౌన్‌తో పాటు రైతుల శిక్షణ కేంద్రం, కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను నిర్మించింది. ఈ కేంద్రం మొత్తం 4,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఇది 3,000 చదరపు అడుగుల రైతు శిక్షణ కేంద్రం, 1,600 చదరపు అడుగుల కస్టమ్ హైరింగ్ సెంటర్, ఎఫ్‌పిఓ వ్యవసాయ పరికరాలు, ఇన్ పుట్‌ల కోసం నిల్వ సౌకర్యాన్ని కలిగి ఉంటుంది. ■

# నీటి వినియోగంపై అవగాహన కల్పించాలి

**నీటి** వినియోగం, పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. నీటి వినియోగం, పారిశుధ్యం, పరిశుభ్రత తదితర అంశాలపై ఏపిమాస్, మెప్మా సంయుక్తంగా మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్ రెండోరోజూ కొనసాగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ, నీటి వినియోగం, పారిశుధ్య అంశాలపై మహిళా అభివృద్ధి సొసైటీ సంఘాలకు అవగాహన కల్పించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను మహిళా సభ్యులకు తెలియ



జేస్తూ, వారికి నీటి వినియోగం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడంపై మెప్మా ఆర్పీల కృషిని అభినందించారు.

అనంతరం ఏపిమాస్ ప్రతినిధి బ్రహ్మాచారి మాట్లాడుతూ, నీటి వినియోగం, పారిశుధ్యం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటిని వృథా చేయకుండా ఒడిసి పట్టుకొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో సౌచాలయాన్ని పరి శుభ్రంగా ఉంచుకోవాలని, సౌచాలయం నిర్మాణం, మరమ్మతుకు, ఇతర తాగు నీటి సౌకర్యానికి ఏపిమాస్ సంస్థ నుంచి రుణం ఇస్తుందని వివరించారు. అనంతరం రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రాజేశ్వర్, ఏవో శ్రీనివాస్ గౌడ్, మెప్మా డీఎంసీ సునీత, టీఎంసీ రజిత, సీవోలు రాధ, నాగరాణి, మెప్మా రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు. ■

**ఇతరుల కష్టసుఖాలలో నీవు తోడుగా నిలిస్తే నీ కష్టసుఖాలలో వారు నీకు తోడుగా నిలుస్తారు**

# రోజూ కూలీకి వెడుతూనే ఆమె పిహెచ్ డి సాధించింది!

పట్టుదల ఉండాలే కానీ, పేదరికం అభివృద్ధికి అవరోధం కాదని నిరూపించింది ఓ దినసరి కూలీ. అవును అన్ని సదుపాయాలూ ఉన్నా ఇంకా ఏదో కావాలని, కాలాన్ని వృథా చేస్తుంటారు కొందరు. కానీ రెక్కాడితే కానీ డొక్కాడని ఓ మహిళ చదువుపై తనకున్న మక్కువతో రాత్రి, పగలూ కష్టపడి కెమిస్ట్రీలో పీహెచ్ డి చేసింది. అనంతపురం జిల్లా శింగనమల మండలం నాగులగుడ్డం అనే మారుమూల పల్లె ప్రాంతానికి చెందిన సాకే భారతి కుటుంబం ఓ చిన్న రేకుల షెడ్డులో నివసిస్తోంది. భారతికి చిన్నప్పటినుండి పెద్ద చదువులు చదువుకోవాలని ఆశ ఉన్నా.. ఆమె తల్లిదండ్రులకు ముగ్గురమ్మాయిలు, అందులో భారతి ఇంటికి పెద్దది, పదో తరగతి వరకు శింగనమల ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ పామిడి జూనియర్ కాలేజీలో చదువుకుంది. అయితే భారతి ఇంట్లో పెద్ద అమ్మాయి కావడం, మిగతా ఇద్దరు ఆడపిల్లల పోషణ కూడా కష్టం కావడంతో.. ఇంటర్‌తో చదువు మాన్పించి, మేనమామ శివప్రసాద్ కిచ్చి పెళ్లి చేశారు తల్లి దండ్రులు. చదువంటే తనకు ఎంతో ఇష్టమని భర్తకు చెప్పడంతో అతడు ఆమెను పై చదువులకు ప్రోత్సహించాడు.



రోజూ కూలీ పనులకు వెళుతూనే అనంతరపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ, పీజీ పూర్తి చేసింది. కాలేజీకి వెళ్లాలంటే ఊరి నుంచి కనీసం 28 కిలోమీటర్లు ప్రయాణించాలి. రవాణా ఖర్చులు భరించలేక.. తన ఊరి నుండి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని గార్లదిన్నె వరకూ నడిచి వెళ్లి అక్కడ బస్సు ఎక్కేది. ఈ సమయంలోనే భారతి, శివ ప్రసాద్ దంపతులకు కూతురు గాయత్రి పుట్టింది. దీంతో కుటుంబ పోషణ కోసం పొద్దున్నే పనులకు పోయి, సాయంత్రం ఇంటికి వచ్చి చదువుకునేది. అంత శ్రద్ధగా చదివి పీజీ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఆమె శ్రమ, పట్టుదల చూసి అధ్యాపకులు, ఆమె భర్త కూడా పీహెచ్‌డీ చేయాలని ప్రోత్సహించారు. పీహెచ్‌డీ చేయాలనే ఆశయాన్ని ఆమెలో బలంగా నింపుకుంది. వారి సంకల్పం ఫలించింది. ప్రయత్నిస్తే ప్రొఫెసర్ డా.ఎంసీఎస్ శుభ దగ్గర 'బైనరీ మిక్చర్స్' అంశంపై పరిశోధనకు అవకాశం లభించింది. ఇందుకోసం వచ్చే ఉపకార వేతనం భారతికి కొంత సాయపడింది. అయినా, తను కూలి పనులు చేయడం మాత్రం మానలేదు. కోచింగ్ కాని, అదనపు తరగతుల సాయం కాని లేకుండానే ఆమె రసాయన శాస్త్రం (కెమిస్ట్రీ)లో డాక్టరేట్ సాధించడం విశేషం.

డాక్టరేట్ చేస్తే వర్సిటీ స్థాయిలో మంచి ఉద్యోగం దొరుకు తుందని, అది తమ జీవితాల్ని బాగు చేస్తుం దని భావించింది. అంతేకాదు, తాను కష్టపడి పిహెచ్‌డీ సాధిస్తే తనలాంటి మరికొందరికి ప్రేరణ అవుతుందని, తాను నేర్చుకున్న జ్ఞానాన్ని మరెంతో మందికి పంచవచ్చునని అనుకుంది. ఈ ఆలోచనలే తనను ముందుకు నడిపించాయని భారతి చెప్పింది.

ఇటీవల జరిగిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో భర్త, కూతురుతో కలిసి వేదికపైకి వచ్చింది. పారగాన్ చెప్పులు, ఓ సాదా చీర కట్టుకుని ఆమె వేదిక ఎక్కుతుంటే.. ఆమె ఎలా పీహెచ్‌డీ చేసిందని అందరి ముఖాల్లో ఆశ్చర్యం. ఇది కదా సక్సెస్ అంటే.. అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నా.. జీవితం పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించే యువతకు భారతి విజయగాథ ఓ స్ఫూర్తి పాఠం. ఆమె పీహెచ్‌డీ సాధించిందని తెలిసి ఊరంతా సంబరపడింది. మరోవైపు ఆశ్చర్యపడింది. ■

# నల్ల టమాటాల సాగుతో భారీ లాభాలు!

టమాటాల్లో నల్లవి కూడా ఉంటాయా అనే అనుమానం మనలో చాలా మందికి ఉంటుంది.కాని నల్ల టమాటాలు వున్నాయి. అవి ఒక రకం. దాదాపు వంకాయల రంగులో కనిపిస్తాయి. ఇండియాలో ఇప్పుడిప్పుడే రైతులు ఈ టమాటాలు పండిస్తున్నారు. ఇప్పటికే వేల మంది లాభాలు పొందుతున్నారు కూడా. మీరు కూడా అరుదైన పంటలు పండించాలి అనుకుంటున్నట్లయితే.... నల్ల టమాటాల సాగు మంచి ఆప్షన్ కాగలదు.





నల్ల టమాటాలకు ఇండియాలో విపరీతమైన డిమాండ్ ఉంది. ఉత్పత్తి చాలా తక్కువ ఉంది. మంచి ధర పలుకు తోంది. రైతులకు భారీ లాభాలు వస్తున్నాయి. అందువల్లే ఈ పంట వేయడం బెస్ట్ అనుకోవచ్చు.

మీరు గనుక నల్ల టమాటాల్ని పండించి.. మార్కెట్‌కి తీసుకెళ్తే.. వెంటనే ప్రజలు కొనేస్తారు. ఎందుకంటే.. ఇవి ఎలా ఉంటాయో ట్రై చేద్దాం అనే ఉద్దేశంతో చాలామంది కొనుక్కుంటారు. వాళ్లకు థ్రిల్.. మీకు చిల్.

ఎర్ర టమాటాల కంటే.. నల్ల టమాటాలకు డిమాండ్ ఎక్కువ. ఎందుకంటే.. క్యాన్సర్‌ని అడ్డుకోవడంలో ఈ టమాటాలు బాగా పని చేస్తున్నాయి. క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌లో వీటిని ఉపయోగిస్తున్నారు. ఈ టమాటాలు చాలా వ్యాధుల్ని కూడా తగ్గిస్తున్నాయని పరిశోధనలు తేల్చాయి.

ఈ టమాటాలు ఎక్కువ పుల్లగా, తియ్యగా ఉండవు. ఉప్పగా ఉంటాయి. బరువు తగ్గడానికీ, షుగర్ లెవెల్స్ తగ్గించడానికీ, కొలెస్ట్రాల్ తగ్గించడానికీ వీటిని ఎక్కువగా వాడుతారు.

ఎర్ర టమాటాలు ఎలా పండిస్తారో... నల్ల టమాటాలు కూడా అలాగే సాగు చేస్తారు. వేడి వాతావరణం ఉండాలి. భారత వాతావరణం బాగా సూట్ అవుతుంది. భూమిలో పిహెచ్ వాల్యూ 6 నుంచి 7 ఉండాలి. ఈ టమాటాలు కొద్దిగా ఆలస్యంగా కాపుకాస్తాయి.

ఈ సాగు ఇంగ్లండ్ నుంచి ప్రారంభ మైంది. అక్కడ ఈ టమాటా లను ఇండిగో రోజ్ టమాట అంటారు. అక్కడ వీటిని సూపర్ ఫుడ్ అంటారు.

నల్ల టమాటాల విత్తనాలను జనవరిలో నాటు వెయ్యాలి. మార్చి – ఏప్రిల్ టైమ్‌లో దిగుబడి వస్తుంది.

ఈ పంట సాగుతో.. ఖర్చులన్నీ తీసేయగా... హెక్టారుకి రూ.4నుంచి 5 లక్షల లాభం వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్యాకింగ్, బ్రాండింగ్ ద్వారా లాభం మరింత పెంచుకోవచ్చు అంటున్నారు.

మీరు ఈ పంట సాగు చెయ్యాలి అనుకుంటే.. మీ దగ్గర్లోని వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలూ తప్పక తీసుకోండి.

(న్యూస్ 18 తెలుగు సౌజన్యంతో)

■

సమస్యలనుంచి పారిపోతుంటే ఏనాడూ గెలవలేవు, ఎదురు నిలిచి ఎదుర్కోవడమే విజయ రహస్యం !

# చిత్రవిచిత్రాలు చేయిస్తున్న టమాటా !

**కొ**న్ని నెలల కిందట కేజీ రూ.10 కంటే తక్కువ పలికిన టమాటా ధర ఇప్పుడు కొండెక్కి కూర్చుంది. దేశంలో చాలా ప్రాంతాల్లో టమాటా కిలో రూ. 150 నుంచి 250 వరకు పలుకుతున్నాయి. ఒకప్పుడు ధర లేక రైతులు రోడ్డు పక్కన పారబోసిన స్థితి నుంచి ఇప్పుడు అత్యంత ప్రియంగా మారిన స్థితికి టమాటా ధరలు చేరుకున్నాయి. కొంతమంది రైతులను కేవలం నెల రోజులలో కోటీశ్వరులను, చేశాయి. ఇంతేకాదు భారీ ధర ఉండటంతో దొంగతనాలు, దౌర్జన్యాలకు కూడా టమాటాలు కారణమవుతున్నాయి. ఎన్నో జోకులు, వ్యంగ్య కథనాలు, హాస్య కవితలు కూడా పుట్టుకొస్తున్నాయి. ఇది టమాటా చెలరేగుతున్న కాలం. వార్తాపత్రికలలో రోజూ చిద్విలాసంగా దర్శనమిస్తున్న టమాటా వీరగాథలను కొన్నిటిని చూద్దాం.



*మదనపల్లె టమాటా మార్కెట్‌లో ఒక దృశ్యం*

**పూణే రైతుకు ఒక్కనెలలో రూ.3 కోట్లు**

మహారాష్ట్రలోని పూణేకు చెందిన ఈశ్వర్ గైకార్ (36) అనే రైతు టమాటాలు అమ్మి కేవలం నెల రోజుల్లోనే రూ. 3 కోట్లు సంపాదించాడు. జూన్ 11 నుంచి జూలై 18 మధ్యలో అతడు 3,600 క్వింటాళ్ల టమాటాలు అమ్మాడు. ఈశ్వర్‌కి 18 ఎకరాల భూమి ఉంది. అందులోని 12 ఎకరాల్లో చాలా ఏళ్లుగా టమాటా సాగు చేస్తున్నాడు. టమాటా ధర భారీగా పెరగడంతో ఈసారి అతనిపై లాభాల వర్షం కురిసింది. తమ కష్టానికి ప్రతిఫలం దక్కిందని ఈశ్వర్ ఆనందం వ్యక్తం చేశాడు.

**కర్ణాటక రైతుకు ఒకే రోజు రూ. 38 లక్షలు**

కర్ణాటకకు చెందిన ఓ టమాటా రైతు ఒకే రోజు రూ. 38 లక్షలు ఆర్జించాడు. బేతమంగళం జిల్లాకు చెందిన ప్రభాకర్ గుప్తా, అతని సోదరుడికి 40 ఎకరాల భూమి ఉంది. అందులో వారు టమాటా పండించారు. మంగళవారం ఒక్కో బాక్సును రూ.1900ల చొప్పున 2 వేల బాక్సులను మార్కెట్లో విక్రయించారు. టమాటాకు భారీ ధర రావడంతో వారి ఆనందానికి అవధులు లేవు.

ఇప్పుడు మన తెలుగు రాష్ట్రాల్లోని రైతులు టమాటా పంటద్వారా కోట్ల రూపాయలు ఆర్జించిన విశేషాలు తెలుసుకుందాం.

**నెలలో రూ.3 కోట్లు ఆర్జించిన చిత్తూరు రైతు**

చిత్తూరు జిల్లా సోమల మండలం కరకమంద గ్రామానికి చెందిన పి. చంద్రమౌళి, అతడి సోదరుడు మురళి కలిసి ఉమ్మడిగా వ్యవసాయం చేస్తున్నారు. వీరికి కరకమందలో 12 ఎకరాలు, సువ్వారపుపల్లెలో 20 ఎకరాల పొలం ఉంది. ఇందులోని 22 ఎకరాల్లో ఏళ్ల తరబడి టమాటా పంటను సాగు చేస్తున్నారు. ఈసారి జూన్, జులైలో దిగుబడి వచ్చేలా టమాటాలను సాగు చేశారు. టమాటాల ధరలు భారీగా పెరగడంతో నెల రోజుల్లో రూ. 3 కోట్ల ఆదాయం వచ్చిందని చంద్రమౌళి చెప్పాడు.

**మెదక్ జిల్లా రైతుకు రూ.1.80 కోట్లు**

తెలంగాణలోని మెదక్ జిల్లాకు చెందిన రైతును టమాటా పంట కోటీశ్వరుడిని చేసింది. మెదక్‌లోని కౌడిపల్లి మండలానికి చెందిన రైతు బాన్సువాడ మహిపాల్ రెడ్డి 40 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు.

మహిపాల్ రెడ్డి ఏప్రిల్ 15న కౌడిపల్లిలో ఎనిమిది ఎకరాల్లో టమాటా వేశాడు. మండు వేసవిలో పంటను కాపాడుకునేందుకు షేడ్ నెట్స్ ఉపయోగించి పెంచాడు. జూన్ నెల మధ్య నుంచి టమాటా ధర పెరుగుతూ వస్తోంది.

నీ కంటె ఎంత గొప్పవారితో వున్నావని కాదు, వారు నీకు అండగా నిలిచే వారో కాదో ఆలోచించుకో

మహిపాల్ రెడ్డి చేతికి పంట వచ్చే సమయానికి కిలో రూ.100కు చేరుకుంది. ఆ తర్వాత అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. దీంతో ఈ నెల రోజుల్లో ఆయన టమాటా అమ్మకం ద్వారా రూ.1.80 కోట్లు సంపాదించారు.

తాను ఇరవై ఏళ్ళుగా వ్యవసాయం చేస్తున్నానని, కానీ ఒక నెలలో ఇంత డబ్బును ఎప్పుడూ చూడలేదని మహిపాల్ రెడ్డి అన్నారు. ఈ నెల రోజుల్లో 7వేల బాక్సుల టమాటాలను విక్రయించినట్లు చెప్పారు. ఒక్కో బాక్సును గరిష్ఠంగా రూ.2600కు విక్రయించానని చెప్పారు. గతంలోను మంచి ధరలు చూశామని, కానీ రూ.100 దాటి, ఈ స్థాయికి పోవడం.. తమ చేతికి ఇంత డబ్బు రావడం ఇదే మొదటిసారి అన్నారు.

**టమాటాల చోరీ ... కేసు నమోదు**

మహారాష్ట్రలోని పూణెలో ఓ రైతు పండించిన 400 కిలోల టమాటా చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... షిరూర్ తహసీల్‌లోని పింపార్‌ఖేడ్‌కు చెందిన రైతు అరుణ్ ధోమ్ కు చెందిన టమాటాలను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఆయన పూణే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను పండించిన నాలుగు వందల కిలోల టమాటాలను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

తన ఇంటి బయట పార్క్ చేసిన వాహనంలో 20 డబ్బాల టమాటాలను ఆ రైతు ఉంచినట్లు పోలీసులు తెలిపారు. అయితే మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి టమాటా డబ్బాలు కనిపించకుండా పోయాయని, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి, తన పంట చోరీకి గురైనట్లు అతను గుర్తించాడన్నారు. దీంతో అతను పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇచ్చారని షిరూర్ పోలీస్ స్టేషన్‌లోని ఒక అధికారి తెలిపారు. ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తులపై చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**చెన్నై సహకార సంఘాలచే మదనపల్లె టమోటా కొనుగోలు**

చెన్నై సహకార సంఘాలు ప్రతిరోజూ 10 టన్నుల ఆంధ్రా టమాటాలను కొనుగోలు చేస్తున్నాయి. రాష్ట్రంలో




టమాటా కిలో రూ.100కి పైగా ధర పలుకుతోంది. దీంతో హరిత, రేషన్ దుకాణాల్లో కిలో రూ.60 కే సహకారశాఖ విక్రయిస్తోంది. ఈక్రమంలో ఆంధ్రరాష్ట్రంలోని మదనపల్లె టమాటా సంత వేలంలో రాష్ట్ర సహకార సంఘాలు తొలిసారిగా 19-07-23న 10 టన్నుల టమాటాను కిలో రూ.75 ధరకు కొనుగోలు చేసి, వాటిని తిరువళ్లూరు, చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో వున్న హరిత దుకాణాలు, రేషన్ దుకాణాల్లో రూ.60 వంతున విక్రయించాయి.

## కూరలో రెండు టమాటాలు వేశాడని భర్తపై అలిగి వెళ్ళిన భార్య

పెరుగుతున్న టమాటా ధరలు.. సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ కిలో టమాటా రూ.150 నుంచి రూ.200 వరకూ పలుకుతుండటంతో జనం జేబులకు చిల్లులు పెట్టడమే కాదు.. పచ్చని సంసారాల్లో చిచ్చు రేపుతోంది. కొన్ని చోట్ల భార్యాభర్తల మధ్య గొడవలకు కూడా టమాటా ధరలు కారణమవుతున్నాయి. తాజాగా, టిఫిన్ సెంటర్ నడుపుతోన్న ఓ దంపతులు ఈ విషయంలో గొడవపడ్డారు. తనకు చెప్పకుండా కూరలో రెండు టమాటాలు ఎక్కువ వేశాడని భర్తతో గొడవపడిన భార్య తన కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఆమె కోపంతో వెళ్లిపోయిందిలే.. తిరిగొస్తుందని సదరు భర్త అనుకున్నాడు. కానీ, ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికిన సదరు భర్త.. లబోదిబోమంటూ తన భార్య కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ విచిత్రమైన సంఘటన మధ్యప్రదేశ్‌లోని షాడోల్ జిల్లాలో చోటుచేసుకుంది.

# టమాటా లారీని ఎత్తుకెళ్లారు... దొరికిపోయారు!

ఇటీవల కర్ణాటకలో ఓ టమాటా లారీ చోరీకి గురైంది. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు భాస్కరన్ (38), సింధుజ (35) అనే దంపతులను తమిళనాడులో అరెస్ట్ చేశారు. ఆ దంపతులు చోరీ చేసిన టమాటా లోడును తమిళనాడులో రూ. 1.6 లక్షలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.



అసలు, ఈ టమాటా మినీ లారీ దొంగతనం సినీ ఫక్కీలో జరిగింది, ఏం జరిగిందంటే... జులై 8వ తేదీన శివన్న అనే లారీ డ్రైవర్ ఆర్ఎంసీ యార్డ్ పోలీసులను ఆశ్రయించాడు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తన మినీ లారీని ఎత్తుకెళ్లారని శివన్న ఫిర్యాదు చేశాడు. అందులో 210 ట్రేల నిండా టమాటాలు ఉన్నాయని, వాటి విలువ రూ. 1.5 లక్షలు ఉంటుందని వెల్లడించాడు.

చిత్రదుర్గ జిల్లాలోని హిరియూర్ నుంచి కోలార్ ప్రాంతానికి ఆ టమాటాలు తీసుకెళుతున్నానని, అయితే, గోరగుంటపాళ్య వద్ద చిన్న యాక్సిడెంట్ జరిగిందని శివన్న పోలీసులకు వివరించాడు. "నీ మినీ లారీ మా మహీంద్రా జైలో వాహనాన్ని ఢీకొట్టిందని కొందరు వచ్చి నాతో వాగ్వాదం పెట్టుకున్నారు" అని వెల్లడించాడు.

మహీంద్రా జైలో వాహనంలోని వ్యక్తులు తనతో గొడవ పెట్టుకున్నారని, నష్టపరిహారం కింద రూ. 50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారని, కానీ తాను అందుకు నిరాకరించడంతో టమాటా లోడుతో ఉన్న తన మినీ లారీని ఎత్తుకెళ్లారని శివన్న వివరించాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు... ఇదొక ఘర్షణ కేసుగా భావించారు. యాక్సిడెంట్ సందర్భంగా గొడవ జరిగి ఉంటుందని, ఆ కోపంలో లారీని ఎత్తుకెళ్లి ఉంటారని అనుకున్నారు..

అయితే, ఈ కేసులో సీసీటీవీ ఫుటేజి పరిశీలిస్తే కేసును మలుపు తిప్పిన అంశం వెల్లడైంది. టమాటా లారీ,



మహీంద్రా జైలో వాహనాలు తమిళనాడులోని వనియంబాడి వైపు వెళ్లినట్టు సీసీటీవీ ఫుటేజి ద్వారా వెల్లడైంది.

అయితే, ఆ వ్యక్తులు చోరీ చేసిన వాహనం నెంబరు ప్లేటుపై ఉన్న అంకెలను చెరిపివేయడం అనుమానాలకు తావిచ్చింది. తమ మహీంద్రా జైలో వాహనం నెంబరు ప్లేటును మాత్రం యథాతథంగా ఉంచేయడంతో వారు దొరికిపోయారు. దాదాపు 200 సీసీ టీవీ కెమెరాల ఫుటేజిని పరిశీలించిన పోలీసులు... టమాటా లారీ చోరీకి పాల్పడిన వ్యక్తులను

పనియంబాడిలో వారి నివాసంలోనే అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు భాస్కరన్‌పై ఇప్పటికే 10 దొంగతనం, దోపిడీ కేసులు ఉన్నట్టు గుర్తించారు.

టమాటా లారీని చోరీ చేసేందుకే యాక్సిడెంట్, నష్టపరిహారం అంటూ నాటకం ఆడారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ కేసుతో సంబంధం ఉన్న కుమార్, మహేశ్ అనే వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ■

నీవు ఎవరి మనసైనా నొప్పిస్తే వారి మన్నన కోరు, నిన్నెవరైనా నొప్పిస్తే వారిని మన్నించు

# ఎఫ్ పి ఓ లే రైతన్నకు బలం, బలగం !

**సం**ఘే శక్తి కలియుగే... అన్నారు. కలియుగమే కాదు, ఏ యుగమైనా ఐకమత్యమే బలమన్నది అందరికీ తెలిసిన సత్యమే. అందుకే అన్ని రంగాల్లోనూ సంఘాల ఏర్పాటును చూస్తున్నా వ్యవసాయ రంగంలో అలాంటివి కన్పించేవి. కావు. చిన్న చిన్న కమతాలతో ఆటు వాతావరణంతోనూ, ఇటు ఆర్థిక సామాజిక పరిస్థితులతోనూ ఒంటరి పోరాటం చేస్తూ తరచూ ఓడిపోతున్న రైతుని గెలిపించేందుకు ఇప్పుడీ రంగంలోనూ సంఘాలు వచ్చేశాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ - ఎఫ్‌పిఒ) ఇప్పుడు వారిని కలిసికట్టుగా నిలుపుతున్నాయి... విజేతలుగా నిలబెడుతున్నాయి.

సరిగ్గా మూడు నెలల క్రితం టమాట ధర ఏమాత్రం గిట్టుబాటు కాక మార్కెట్‌కి తీసుకు రావడం కూడా దండగే అనుకుని లారీల కొద్దీ టమాటాలను రైతులు రోడ్డు పక్కన పారేసిన వార్తలు చూసి 'అయ్యో పాపం' అనుకున్నాం.

మూణెల్లు తిరిగేసరికల్లా వాటి ధర వంద దాటడంతో 'అమ్మో టమాటాలు' అనుకుంటున్నాం. పంట ఉన్నప్పుడు ధర లేదు, ధర ఉన్నప్పుడు పంట లేదు... రెండు సందర్భాల్లోనూ నష్టపోయింది రైతే.

మరో వైపు నుంచి చూద్దాం... సబ్బులు తయారుచేసే కంపెనీ తనసబ్బుకి తనే ధర నిర్ణయిస్తుంది. మనం బేరమాడకుండా కొంటాం. అదొక్కటే కాదు, పొద్దున్న లేచిన దగ్గర్నుంచీ మనం వాడే టూత్‌పేస్టూ బ్రష్షూ, బట్టలూ చెప్పులూ బ్యాగులూ పుస్తకాలూ పెన్నూ ఫోనూ. అన్నిటికీ తయారీదారులే ధర నిర్ణయిస్తారు. ఏ దుకాణానికి వెళ్లినా వాటి ధర మారదు. నచ్చినా, నచ్చకపోయినా అవసరం కాబట్టి కొంటాం.

అదే కూరగాయల దగ్గరికి వస్తే... గీసి గీసి బేరం ఆడతాం. పక్క దుకాణంలో రెండు రూపాయలు తగ్గిస్తే అక్కడికి వెళ్లిపోతాం. అమ్ముడు పోకపోతే పాడైపోయే వస్తువులు కాబట్టి వచ్చిందే చాలనుకుని తక్కువకీ ఇచ్చేసి నిస్సహాయంగా తిరిగి వెళ్లిపోయేది వాటిని పండించిన రైతే. ధాన్యమూ పప్పుగింజల్లాంటివాటికేమో ఏటా ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర కోసం కళ్లు కాయలు కాచేలా వేచి చూసేదీ రైతే..

ఎందుకీ తేడా? అవీ ఉత్పత్తులే...ఇవీ ఉత్పత్తులే. పైగా అవిలేకుండా బతకొచ్చేమో కానీ ఇవి లేకుండా బతకలేం. అయినా మిషన్లసాయంతో తయారుచేసే ఉత్పత్తులకు వాటి



యజమానులు పెట్టిందే ధర. మనుషులు ఆరుగాలం కష్టపడి పండించే ఉత్పత్తులకేమో యజమానికి ఏమాత్రం సంబంధం లేకుండా ప్రభుత్వమో మరొకరో ధర నిర్ణయిస్తారు.

ఈ తేడా పోయి రైతులకు న్యాయం జరగాలంటే వారినీ ఉత్పత్తిదారులుగా పరిగణించాలన్న ఆలోచన చాలాకాలంగా ఉంది. సహకార వ్యవస్థకు పునాది ఆ ఆలోచనే కావచ్చు. దాదాపు వందేళ్ల క్రితం నుంచీ ఆచరణలో ఉన్న ఈ సహకార వ్యవస్థలో పాడి రైతులూ చెరుకు రైతులూ విజయం సాధించినట్లుగా ఇతర రైతులు సాధించలేకపోయారు.

రాజకీయ జోక్యమూ, నిధుల దుర్వినియోగమూ లాంటి రకరకాల కారణాల వల్ల అధిక శాతం వ్యవసాయ సహకార సంఘాలు అపకీర్తినే మూటగట్టుకున్నాయి. ఈ పరిస్థితుల్లో

**పదిమందిని బాధపెట్టి పైకెదగడం గొప్పకాదు, పదుగురికి తోడ్పడుతూ ఎదగడమే గొప్ప**

రైతుది ఒంటరి పోరాటమే అవుతోంది. నీటి వసతి లేకపోయినా నాణ్యమైన విత్తనం దొరక్కపోయినా పెట్టుబడికి డబ్బు లేకపోయినా పండిన పంటని అమ్మే క్రమంలో గిడ్డంగులు లేక మార్కెట్ యార్డులో తడిసి మొలకలెత్తినా... రైతు అన్యాయమైపోతాడు. ఇక ఏడాదంతా ఏం తిని బతుకుతాడూ, పెట్టుబడికి చేసిన అప్పెలా తీరుస్తాడూ..?

అందుకే దేశంలో తరచూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న, సాగు వదిలి కూలీలుగా వలసబాట పడుతున్న రైతుల్ని చూస్తున్నాం.

**రైతు సంఘంవల్ల లాభాలెన్నో**

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సంఘం... రైతన్న బలం, బలగం! ఒంటరిగా చేయలేనివి. అన్నీ సంఘంగా చేయగలుగుతాడు. ఎక్కడా మోసపోయే పరిస్థితి రాదు. పొలంలో సాగు తాను చూసుకుంటే చాలు- విత్తనాల ఏర్పాటు నుంచీ అన్ని పనులూ సంస్థ చేసి పెడుతుంది. విత్తనాలూ ఎరువుల్లాంటివి సభ్యులందరికీ ఒకేసారి పెద్ద మొత్తం నేరుగా కంపెనీ నుంచే కొనడం వల్ల తక్కువ ధరకి పొందవచ్చు. ఇంకా...

- సాగులో సాంకేతికతను వినియోగించి తేలిగ్గా పనులు చేసుకోవచ్చు.
- చాలా ప్రభుత్వ పథకాల్లో రైతులకు 35 నుంచి 50 శాతం సబ్సిడీ ఉంటుంది. అదే ఎఫ్పీఓలకైతే 75 శాతం సబ్సిడీ.. వస్తుంది. ఉదాహరణకు ఐదువేల మెట్రిక్ టన్నుల శీతల గిడ్డంగి పెట్టుకోవాలంటే సబ్సిడీ పోను దాదాపు మూడు కోట్లు రావాలి. అదే సంఘం తరపున అయితే కోటి రూపాయలు చాలు.
- రైతుకి పంట పండించడం తెలుసు కానీ వ్యాపారం తెలియదు. ఆ సామర్థ్యాల్ని సంఘం నేర్పిస్తుంది. వ్యవసాయ, వ్యాపారం నిపుణులతో తరచూ శిక్షణ కార్యక్రమాలు.. ఏర్పాటు చేస్తారు. సాగులో మెలకువల నుంచీ గిట్టుబాటు ధర పొందడం వరకూ అన్నీ తెలుసుకోవచ్చు.
- పంట చేతికి వచ్చినప్పుడు మార్కెట్లో ధర లేకపోతే రైతు దగ్గర ఆ పంటని తీసుకుని శీతల గిడ్డంగిలో నిల్వ చేసి ధర వచ్చినప్పుడు సంఘమే అమ్మి పెడుతుంది. ఒకవేళ రైతుకి డబ్బు అత్యవసరమైతే సంఘమే ఆ మొత్తాన్ని రుణంగా ఇస్తుంది.
- రైతులు తమ ఉత్పత్తులకు విలువ పెంచే పనులెన్నో చేసుకోవచ్చు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకోవచ్చు.. అప్పుడు ధర లేదని ఉత్పత్తుల్ని పారేసుకోవాల్సిన పరిస్థితి రాదు. కొన్నిటిని ఎండబెట్టి ఒరుగులు చేయవచ్చు. కొన్నిటితో రసాలూ, జామ్‌లూ, కెచులూ పొడులూ పచ్చళ్లూ లాంటివి తయారు చేయవచ్చు. చిత్తూరు జిల్లా చెల్దిగానిపల్లెలో రైతులు ఏపీఐఐసీ ద్వారా రెండెకరాల భూమిని పొంది టమాట ప్రాసెసింగ్ యూనిట్ పెట్టుకున్నారు.
- అలాగే ఉల్లిపాయల్ని డీహైడ్రేట్ చేయడం, బొప్పాయి నుంచి టూటీ ఫ్రూటీలు చేయడం, ఎంజైమ్ ఎక్స్‌ట్రాక్ట్ చేయడం, పండ్ల నుంచి రసాలు: తయారుచేయడం... లాంటివెన్నో ఈ సంఘాలు చేపడుతున్నాయి.
- అరటి నుంచి ఇంతకు ముందు చెప్స్ లాంటివి చేసేవాళ్లు. ఇప్పుడు నార తీసి వస్త్ర పరిశ్రమకు అందిస్తున్నారు. ఒక్క ఆహారపదార్థాలు, ప్రాసెసింగే కాదు, పువ్వులూ పండ్లూ ఆకుల నుంచీ సౌందర్య సాధనాలూ ఔషధాల తయారీకి రకరకాల నూనెల్నీ ఇతర పదార్థాల్నీ తీస్తున్నారు.
- ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాఖ ఇచ్చే సబ్సిడీలు కూడా ఈ సంఘాలకు ఎంతగానో ఉపయోగపడతాయి.
- సౌరశక్తితో పనిచేసే శీతల గిడ్డంగుల్నీ డీహైడ్రేషన్ యూనిట్స్ (ఎండబెట్టుకునేవి) నీ ఏర్పాటు చేసుకోవచ్చు. సౌర విద్యుత్తు, పెన్సింగ్ లైట్లు వీటన్నిటికీ పెద్ద మొత్తంలో సబ్సిడీలు లభిస్తున్నాయి.

ఉదాహరణకు- బటన్ మష్రూమ్ యూనిట్ ఏర్పాటుకి దాదాపు 15 లక్షలు కావాలి. అందులో -40 శాతం సబ్సిడీ వస్తుంది కాబట్టి సంఘం సాయంతో ఎవరైనా పెట్టుకోవచ్చు. అలాగే పాతిక లక్షలు ఖర్చయ్యే టిష్యూ



కల్చర్.. ల్యాబ్‌ని 12 లక్షలకే పెట్టుకోవచ్చు. సీడ్ ప్రాసెసింగ్, రైపెనింగ్ ఛాంబర్.. ఇలా వేర్వేరు పనులకు వేర్వేరు సబ్సిడీలు ఉంటాయి. రైతు సంఘటితమవడం వల్ల ఖర్చు తగ్గడమే కాదు, లాభము ఎన్నో రెట్లు పెరుగుతుంది.

- దళారుల ప్రసక్తే లేకుండా రైతులంతా కలిసి తమ ఉత్పత్తికి ధర నిర్ణయించి అమ్ముకోవచ్చు. ఇలా అమ్మ డానికి సంఘాలు వినూత్న ప్రయోగాలు చేస్తున్నాయి. అనంతపురంలో అరటి రైతులు ఒక ఏజెన్సీతో మాట్లాడుకుని గతేడాది 75 వేల మెట్రిక్ టన్నుల అరటి పంటను ఎగుమతి చేశారు. విడిగా అమ్ముకుంటే గెలకు రెండు వందలు కూడా వచ్చేది కాదు. ఇలా చేయడం వల్ల 800 దాకా వచ్చిందట.
- తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్రకు చెందిన కొన్ని సేంద్రియ రైతుసంఘాలు కలిసి సహజ ఆహారం ప్రొడ్యూసర్ కంపెనీని పెట్టుకుని సహజ ఆహారం అన్న బ్రాండ్ నేమ్‌తో తమ ఉత్పత్తుల్ని అమ్ముతున్నాయి. తెలంగాణలో బేనిషాన్ రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య రాష్ట్రవ్యాప్తంగా 56 రైతు సంఘాలు పండిస్తున్న పండ్లూ కూరగాయల్ని మార్కెట్ చేస్తూ 40 కోట్ల టర్నోవరు సాధించింది. నగరాలూ, పట్టణాల్లో వారంలో ఒకరోజు కూరగాయల సంత పెట్టడం చూస్తుంటాం.
- తమిళనాడులో ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో తయారైన వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల్ని అమ్మడానికి ప్రత్యేకంగా సంతల్ని ఏర్పాటు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ఎఫ్‌పీఓలు తమ ఉత్పత్తు లను సొంత బ్రాండ్ పేరుతో సూపర్ మార్కెట్లకు సరఫరా చేస్తున్నాయి.

(ఈనాడు సౌజన్యంతో)

■

## చిరుధాన్యాల విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

రైతులు చిరుధాన్యాల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్, ఏపిమాస్‌ప్రతినిధి గోపాలరాజు పేర్కొన్నారు. గుడిబండ ఎఫ్‌పిఓ కార్యాలయంలో ఎస్.సి., ఎస్.టీ రైతులకు చిరుధాన్యం పంట సాగుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల పంటసాగు, మార్కెటింగ్, చిరుధాన్యలను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై రైతులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం



రైతులు చిరుధాన్యాల పంటసాగుపై దృష్టి సారించాలని, ప్రభుత్వం సైతం అలాంటి రైతులకు తగిన ప్రోత్సాహం అందిస్తుందని అందులో భాగంగానే రైతులకు సబ్సిడీతో రాగి విత్తనాలను వ్యవసాయ అధికారులు అందిస్తారని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇదిలా ఉండగా ఏపిమాస్ వారి ఆధ్వర్యంలో, ఎస్.సి, ఎస్.టీ 70 కుటుంబాల రైతులకు జొన్నలు, అరికలు, కొర్రలు, సామలు వంటివి నాణ్యమైన విత్తనాలను ఎకరాకు 2 కేజీల చొప్పున ఉచితంగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ పి ఓ సి సి దేవరాజు, అధ్యక్షుడు రాఘువేంద్ర, ఏపిమాస్ ప్రతినిధి అనిల్ కుమార్, వి.ఏ.ఏ రాధికా, మిత్రులు ప్రవీణ్, మాకబులబి, అకౌంటెంట్ గీత తదితరులు పాల్గొన్నారు.

■

# ఆహారాన్ని అద్భుతంగా నిల్వచేసే 'అరేడియేషన్'

దేశవ్యాప్తంగా ప్రస్తుతం టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దాంతో మార్కెట్‌కు వెళ్లి వీటిని కొనాలంటేనే సామాన్యుడు వెనకడుగు వేసే పరిస్థితి. గతంలో ఉల్లిపాయల పరిస్థితి కూడా ఇలాగే ఉండేది. అందుకే భారత ప్రభుత్వం ఓ సరికొత్త సాంకేతికతను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. తొలుత దాన్ని ఉల్లిపాయలపై ప్రయోగించనుంది. దాంతో ఎక్కువ కాలం ఉల్లిపాయలు కుళ్లిపోకుండా ఉంటాయి. పైగా ఆ పంట పండించిన రైతులు సైతం నష్టాల బారిన పడకుండా చూడొచ్చు. ఇంతకీ ఏంటా టెక్నాలజీ ఎలా పని చేస్తుంది? ఓసారి పరిశీలిస్తే..

**ఏంటీ 'అరేడియేషన్'?**

'అరేడియేషన్' ప్రక్రియలో ఆహారాన్ని రేడియేషన్ అయనీకరణం చేస్తారు. ఇందుకోసం గామా కిరణాలు, ఎక్స్ కిరణాలు, ఎలక్ట్రాన్ కిరణాలను వినియోగిస్తారు. ప్రస్తుతం మన ఉల్లిపాయలను గామా రేడియేషన్‌కు గురి చేయనున్నారు. ఇలా చేయడం వల్ల అందులోని సూక్ష్మ జీవులు, కీటకాలు నశించడంతో వాటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. పాలను పాయిశ్చరైజ్ చేయడం, పండ్లు, కూరగాయాలను క్యానింగ్ చేయడం వల్ల వినియోగదారులకు ఎలాంటి లాభాలు కలుగుతున్నాయో అలాంటి ప్రయోజనాలే ఈ విధానంలోనూ కలుగుతాయి. పేరులో రేడియేషన్ ఉంది గనక ఈ సాంకేతికత ఆహారాన్ని రేడియోధార్మికతగా మార్చదు. నాణ్యత, రుచి, ఆకృతి తదితర విషయాల్లో ఎలాంటి మార్పు తీసుకురాదు..

'అరేడియేషన్'లో ఏ మార్పు జరిగినా అది చాలా స్వల్పంగా ఉంటుంది. అందుకే ఏదైనా పదార్థం 'అరేడియేషన్'కు గురైందా? అనేది చూసి గుర్తించడం చాలా కష్టం. ఈ విధానాన్ని అమెరికాలోని ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఆమోదించాయి. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరీకి చెందిన లెవిస్ స్టాడ్లర్ అనే శాస్త్రవేత్త తొలిసారి విత్తనాలపై ఈ ప్రయోగం చేశాడు. ఈ ప్రక్రియ తృణధాన్యాలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, వెల్లుల్లిపై సమర్థవంతంగా పని చేసింది.

**ప్రయోజనాలివే..**

- 'అరేడియేషన్' చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల వ్యాధులు తగ్గుతాయి. ఆహారంలోని సాల్మోనెల్లా, ఈ కోలి వంటి హానికారక జీవులు నశిస్తాయి.
- 'అరేడియేషన్ వల్ల పండ్లు, కూరగాయల నిల్వ కాలం పెరుగుతుంది. అవి త్వరగా కుళ్లిపోవడానికి కారణమయ్యే జీవులను నాశనం చేయడంతో ఇది సాధ్యపడుతుంది.
- పండ్లలోని కీటకాలు నశిస్తాయి. శీతల గిడ్డంగిలో వాటిని నిల్వచేసేందుకు మళ్లీ మందులు వాడాల్సిన అవసరం ఉండదు.
- ఉల్లిపాయలు, బంగాళాదుంపలు వంటివి ఎక్కువ కాలం నిల్వ ఉంచితే మొలకలు వస్తాయి. ఈ ప్రక్రియ అలా రానివ్వదు. అంతేకాదు త్వరగా పక్వానికి రాకుండా అడ్డుకుంటుంది.
- 'అరేడియేషన్" క్రిమిరహితంలా పనిచేస్తుంది. దాంతో శీతల ప్రదేశాల్లో నిల్వ చేయకపోయినా పండ్లు, కూరగాయలు చెడిపోవు.

**ధరల్లో హెచ్చుతగ్గుల నివారణ**

ఉల్లిపాయల ధరల్లో హెచ్చుతగ్గులను నివారించేందుకు ఈ ఏడాదిలో భారత ప్రభుత్వం సుమారు 3 లక్షల టన్నుల ఉల్లిని అదనపు బఫర్ స్టాక్‌గా సేకరించనుంది. అలాగే బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సహాయంతో ఉల్లిపాయలపై 'అరేడియేషన్' సాంకేతికతను ప్రయోగాత్మకంగా పరిశీలించనుంది. ఈ విషయాన్ని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ తెలిపారు.

– ఈనాడు సౌజన్యంతో

అధికారం, ధనం జీవన ఫలాలు ; కుటుంబం, మిత్రులు జీవన మూలాలు, మూలం లేని ఫలం మరణం!

# చిరుధాన్యాల అంజమ్మకు ఐక్యరాజ్యసమితి జోహార్ !

**"ఆ**మె చదువుకోలేదు. కానీ నేల గొప్పతనం తెలుసు, విత్తనం విలువ తెలుసు. ప్రకృతిని కాపాడాలంటే ఏ పద్ధతిలో సాగు చెయ్యాలో తెలుసు. ఆమె మారుమూల పల్లెకు చెందిన సామాన్యురాలు. కానీ వ్యవసాయ శాస్త్రవేత్తలే ఆశ్చర్య పోయేలా.... 30 రకాల చిరుధాన్యాల పంటలు పండించి 'విత్తన సంరక్షణ' నిధిని ఏర్పాటు చేశారు.

అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రశంసలు పొందిన ఆమె మన తెలుగు మహిళ.... నడిమిదొడ్డి అంజమ్మ, జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా విత్తనాల విప్లవంలో ఆమె చేసిన కృషిపై 'సాక్షి' ప్రచురించిన ప్రత్యేక కథనం 'మహిళా సాధికారత' పాఠకులకోసం ...

అంజమ్మ సొంత ఊరు సంగారెడ్డి జిల్లా గంగ్వార్, అది తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆమె ఐడి ముఖమైనా చూడలేదు. పదేళ్ళ వయసులోనే సమీపంలోని గంగ్వార్‌కు చెందిన సంగప్పతో ఆమె వివాహం జరిగింది. "అప్పట్లో మాకు రెండు పూటలా భోజనం చేసే పరిస్థితి కూడా లేదు. వ్యవసాయ కూలీగా, జీవితాన్ని మొదలుపెట్టాను" అంటూ నాటి రోజులను గుర్తు చేసుకుంది. క్రమ క్రమంగా ఒక అర ఎకరం భూమిని ఆ దంపతులు సమకూర్చుకున్నారు. సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం ప్రారంభించారు. అదే సమయంలోసేంద్రియ విధానంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడానికి జహీరాబాద్ ప్రాంతంలో డక్కన్ డెవలప్మెంట్ సొసైటీ (డీడీఎస్) కార్యక్రమాలు చేపట్టింది. ఆ సొసైటీలో అంజమ్మ సభ్యురాలుగా చేరింది. డీడీఎస్ సహకారంతో తన పొలంలో చిరుధాన్యాలు సాగుచేసింది.

**అర ఎకరం నుంచి పది ఎకరాల భూమికి..**

కొత్త మెళకువలను తెలుసుకుంటూ, వివిధ రకాల పంటలు వేసింది. ఆమె శ్రమ మంచి ఫలితాలను ఇచ్చింది, ముప్పై ఏళ్ళ కాలంలో అర ఎకరం నుంచి పది ఎకరాల భూమికి యజమానురాలుగా మారింది. నూనె గింజలు, పప్పు దినుసులు, రాగులు, సజ్జలు, సామలు, కొర్రలు, తదితర చిరుధాన్యాలు పండించారు. ఇప్పటి వరకూ 80 రకాల చిరుధాన్యాలతో విత్తన సంపదను సృష్టించారు. ఈ విత్తన సంరక్షణ నిధిలోని విత్తనాలను ఆమె ఎవరికి విక్రయించరు. అవసరమయ్యే రైతులకు ఉచితంగా ఇస్తారు, వారికి దిగుబడి వచ్చాక రెట్టింపు విత్తనాలు తీసుకొని మళ్ళీ భద్రపరుస్తారు. స్థానిక వాతావరణానికి అనుగుణంగా వివిధ రకాలను పండిస్తున్న అంజమ్మను 'మొక్కల జీవ వైవిధ్యం. పరిరక్షకురాలు'గా 2019లో కేంద్ర ప్రభుత్వం అవార్డుతో సత్కరించింది.



**అంతర్జాతీయంగా గుర్తింపు**

విత్తన సంరక్షకురాలుగా ఖ్యాతి పొందిన అంజమ్మ నాగాలాండ్, బీహార్, మేఘాలయ, ఒడిశా, అసోంతో సహా 22 రాష్ట్రాల్లో పర్యటించారు. విత్తన సంరక్షణ, సేంద్రియ ఎరువుల తయారీ, మహిళా సంఘాల నిర్వహణ తదితర అంశాల్లో తన అనుభవాలను అక్కడివారితో పంచుకున్నారు.

అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఆహార, వ్యవసాయ విభాగం ప్రపంచస్థాయిలో చిరుధాన్యాల రైతులపై అధ్యయనం చేపట్టింది. చిరుధాన్యాలు పండించడం,

విత్తనాలను అందజేయడం ద్వారా వాటి సాగును ప్రోత్సహించడంలో అంజమ్మ కృషిని ఆ విభాగం గుర్తించి, ప్రశంసలు అందించింది.

ఒక సాధారణ మహిళ అంతర్జాతీయ స్థాయిలో పొందిన ఈ గుర్తింపు జహీరాబాద్ ప్రాంతానికి గర్వకారణ మని పలువురు ప్రముఖులు ఆమెను అభినందిస్తున్నారు. డీడీఎస్ డైరెక్టర్‌గా ఈమధ్య వరకూ పని చేసిన.. దివంగతులైన సతీష్ గారి సలహాలు, సూచనలు నన్ను ముందుకు నడిపించాయి. చిరుధాన్యాలను పండిస్తే మనకు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుంది. పశువులకు, పక్షులకూ కూడా ఇవి మేలు చేస్తాయి అని చెబుతోంది 63 ఏళ్ళ అంజమ్మ.

అంజమ్మ అటు విత్తన సంరక్షణ చేస్తూనే... రాజకీయాల్లో కూడా రాణిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీగా గెలుపొంది, ప్రస్తుతం న్యాలకల్ మండల పరిషత్ అధ్యక్షురాలుగా పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

(సాక్షి సౌజన్యంతో)

■

# నవజాత శిశువుల ఆకలి తీర్చిన అమ్మకు గిన్నిస్ రికార్డ్

**త**ల్లి పాల గొప్పతనం ఏంటో అందరికీ తెలుసు. బిడ్డ ఎదుగుదలలో అవి ఎంతో కీలకం. అయితే కొందరు పసిపిల్లలు వివిధకారణాలతో తల్లిపాలకు దూరం అవుతుంటారు. అలాంటి ఎంతోమంది పిల్లల ఆకలి తీర్చిందో మాతృమూర్తి. ఆమె సహృదయానికి గిన్నిస్ రికార్డు దక్కింది.

అమెరికాలోని ఒరెగాన్‌కు చెందిన ఎలిసాబెత్ అండర్సన్ సియోర్రాకు ఇద్దరు సంతానం. తన బిడ్డలకు పాలు పట్టడంతో పాటు 2015 నుంచి 2018 మధ్యలో 1,599.68 లీటర్ల చనుబాలను విరాళంగా అందించింది. ఈ స్థాయిలో పాలను దానం చేయడంతో ఆమె గిన్నిస్ రికార్డు సొంతం చేసుకుంది.

ఈ లెక్క కేవలం పాల బ్యాంకులకు ఇచ్చినవి మాత్రమే. ఇంక ఆమె వివిధ రూపాల్లో తన పాలను అందించింది.




ఎలిసాబెత్ గిన్నిస్ వరల్డ్ రికార్డుతో మాట్లాడుతూ.. 'ఓసారి ప్యూర్టెరికోలో ఒక నవజాత శిశువుకు పాలుపట్టాను. ప్రసవం సమయంలోని సమస్యలతో ఆ బిడ్డ తల్లిని కోల్పోయింది. ఆ చిన్నారిని రక్షించుకోవడానికి తండ్రి ఒక మిల్క్ బ్యాంకు నుంచి పాలు కొంటున్నారు.

నా భర్తది ప్యూర్టెరికో కావడంతో ఓసారి నేను ఆ ద్వీపానికి వెళ్లాను, అప్పుడే ఆ బిడ్డ గురించి తెలిసి పాలిచ్చాను' అని చెప్పారు. తర్వాత అలా వేలాది మంది పసికందులకు ఆకలి తీర్చడం సంతోషంగా అనిపించేదంటూ ఆనందం వ్యక్తం చేశారు.

హైపర్‌లాక్టేషన్ సిండ్రోమ్ కారణంగా ఎలిసాబెత్‌కు పాలు ఎక్కువగా ఉత్పత్తి అయ్యేవట. ఇలా తనలోని లోపం.. ఎందరో చిన్నారుల ఆకలి తీర్చడానికి ఉపయోగపడిందని, చివరకు గిన్నిస్ రికార్డును ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే తల్లిపాలు ఇవ్వడానికి ఉపయోగించే పరికరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

■

# 'చంద్రయాన్' లో మహిళాయాన్!

**చం**ద్రుడి మీద అన్వేషణ కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇటీవల చేపట్టిన 'చంద్రయాన్–3' నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా చేరి... మన శాస్త్రవేత్తల ఘనతను సమున్నతంగా నిలిపింది. ఈ ప్రాజెక్ట్‌లో ఇంజనీర్లుగా, సైంటిస్టులుగా యాభై నలుగురు మహిళలు పని చేశారు. 'చంద్రయాన్–2'లోనూ మహిళల ప్రాతినిధ్యం ఎక్కువే. వారిలో కీలక పాత్ర పోషించిన ముత్తయ్య వనిత, రీతూ కరిథాల్ ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు.

**వనిత... ఒక చరిత్ర**

ఇస్రోలో రీతూ లాంటి ఎందరికో మార్గదర్శిగా నిలిచిన మహిళ ముత్తయ్య వనిత. ఆ సంస్థలో తొలి మహిళా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఆమె చరిత్రలో తనదైన స్థానం సంపాదించుకున్నారు.... చెన్నైకి చెందిన వనిత డిజైన్ ఇంజనీరింగ్‌లో



మాస్టర్స్ డిగ్రీ చేశారు. ఇస్రోలో జూనియర్ ఇంజనీర్‌గా వృత్తి జీవితం ప్రారంభించారు. వివిధ విభాగాల్లో పని చేసి, అంచెలంచెలుగా ఎదిగారు. 'కార్టోశాట్–1, ఓషన్‌శాట్–2' తదితర అనేక ప్రాజెక్టుల్లో పని చేశారు. ఉపగ్రహాల తయారీలో మేటిగా గుర్తింపు పొందారు.


డేటా నిర్వహణలో నైపుణ్యం, డిజిటల్, హార్డ్‌వేర్‌కు సంబంధించిన అంశాల్లో అపారమైన పరిజ్ఞానం సీనియర్లను ఆకర్షించాయి. 'చంద్రయాన్–1'కు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించిన డాక్టర్ ఎం. అన్నాదురై... 'చంద్రయాన్–2'కు ఆ పదవి కోసం ఆమె పేరు సిఫార్స్ చేశారు. అయితే వనిత ఆ బాధ్యతలు చేపట్టడానికి మొదట ఒప్పుకోలేదు. ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రోజూ పద్దెనిమిది గంటల సేపు పని చేయాల్సి రావడమే కాదు, అనేక త్యాగాలు కూడా చేయాల్సి ఉంటుంది. దేశం ఆకాంక్షలను మోయాల్సి రావడం ఒత్తిడిని



మరింత పెంచుతుంది. అందుకే ఆమె సంకోచించారు. కానీ సమస్యల పరిష్కారంలో, టీమ్ మేనేజిమెంట్‌లో అద్భుతమైన నైపుణ్యాలున్న వనిత ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరని డాక్టర్ అన్నాదురై నమ్మారు. చివరకు ఆమెను ఒప్పించారు. "నా తల్లితండ్రులిద్దరూ ఇంజనీర్లు. వారిని చూస్తూ పెరిగాను. పని ఎంత చిన్నదయినా దాని మీద పూర్తి శ్రద్ధ పెట్టాలి. దానివల్ల ఎల్లప్పుడూ మంచి ఫలితాలు లభిస్తాయని వారి నుంచి నేర్చుకున్నాను.

'చంద్రయాన్–2' ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చినప్పుడు. మొదట్లో సందేహించాను. కానీ తరువాత దాన్ని సవాల్‌గా తీసుకున్నాను. జీవితం మన మీద సవాళ్ళు విసిరినప్పుడు, వాటిని ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను కూడా అదే ఇస్తుంది. ఆ సవాల్‌ను నేను ఎంతగానో ఆస్వాదించాను" అని చెబుతారు వనిత.

వృత్తి జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన ఆమె తాజా 'చంద్రయాన్–3'లోనూ కీలక పాత్ర పోషించారు. 2006లో ఆస్ట్రనామికల్ సొసైటీ నుంచి బెస్ట్ ఉమన్ సైంటిస్ట్ అవార్డు, సత్య సాయి సేవా ట్రస్ట్ నుంచి ఈశ్వరమ్మ అవార్డుతో సహా పలు పురస్కారాలను అందుకున్నారు. "నాకు వంట పని ఇష్టం. కేక్స్ చేస్తాను, కొత్త కొత్త వంటకాలు ట్రై చేస్తాను. మా ఇంట్లోనే పూల మొక్కలతో పాటు, అల్లం, కొత్తిమీర లాంటివి పెంచుతూ ఉంటాను. జీవితమంటే లక్ష్యాలు నిర్దేశించుకోవడమే కాదు, సేద తీరడానికి, జీవితాన్ని ఆస్వాదించడానికీ కూడా సమయం కేటాయించాలి" అని



యువతకు ఒక సందర్భంలో ఆమె సూచించారు. "దేశ ప్రతిష్టను పెంచే ప్రాజెక్టుల్లో పని చేయడం కన్నా సంతృప్తి మరేదీ ఉండదు" అంటున్న వనిత మహిళాలోకానికి గర్వకారణంగా నిలుస్తున్నారు.

**నింగిని తాకి, నిజమైన కల...**

పిల్లలు తమ అభిమాన నటులు, క్రీడాకారుల ఫొటోలు సేకరించి, అపురూపంగా దాచుకొనే వయసది. కానీ రీతూ కరిథాల్ చూపు ఎప్పుడూ ఆకాశంవైపే. పాఠశాల విద్యార్థినిగా ఉన్న రోజుల్లో 'ఇస్రో', అమెరికన్ అంతరిక్ష సంస్థ 'నాసా' నిర్వహించే అంతరిక్ష కార్యకలాపాల గురించి వచ్చిన వార్తా కథనాల్ని సేకరించి దాచుకోవడం ఆమె ప్రధానమైన అభిరుచి. అవి ఇప్పటికీ ఆమె దగ్గర భద్రంగా ఉన్నాయి.

లక్నోలో పుట్టి పెరిగిన రీతూ అక్కడే బిఎస్సీ పూర్తి చేశారు. తరువాత బెంగళూరులోని 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్'లో ఏరో స్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. "మాది మధ్యతరగతి కుటుంబం. అప్పట్లో మాకు ట్యూషన్లు, కోచింగ్ ఇనిస్టిట్యూట్లు లాంటివి ఉండేవి కావు. కానీ బాగా చదువుకోవాలనే తపన నాలో రగిలించింది మా అమ్మా నాన్నా" అని ఆమె చెప్పారు. ఆకాశమంటే రీతూకి ఎందుకింత ఇష్టం? "అంతరిక్షంలోని మిస్టరీల గురించి తెలుసుకోవాలనే తపన చిన్నప్పటి నుంచీ ఉండేది.

రాత్రి ఆకాశంవైపు చూస్తున్నప్పుడు... 'చంద్రుడు ఎందుకు పెరుగుతూ, తగ్గుతూ ఉంటాడు? అంతులేని ఆ చీకట్ల వెనుక ఏముంది?' అనే ప్రశ్నలు నన్ను నిలువనిచ్చేవి కావు. సైన్స్ నాకొక సబ్జెక్ట్ కాదు, ఉద్వేగాన్ని కలిగించే విషయం" అంటారామె. అందుకే ఇస్రోలో ఉద్యోగాల గురించి ప్రకటన చూడగానే వేరే ఆలోచన లేకుండా దరఖాస్తు చేశారు. "నా జీవితంలో అత్యుత్తమమైన క్షణం... ఉద్యోగంలో చేరాలంటూ ఇస్రో నుంచి పిలుపు రావడం. అది 1997. చాలామంది మహిళలు కెరీర్‌నీ, ఇంటినీ బ్యాలెన్స్ చేసుకోవడానికి కష్టపడుతున్న సమయం అది. నేను చేరినప్పుడు ఇస్రోలో ఎక్కువమంది మహిళలు ఉండేవారు కాదు. అయితే, మహిళనని నన్ను తక్కువ చేసి చూడడం, వివక్ష ప్రదర్శించడం లాంటివి ఎప్పుడూ లేవు. ఇక్కడ మీరు ఎలా, ఎంత నాణ్యతతో పని చేస్తారనేదే ప్రధానం" అంటారు రీతూ.

ఇస్రోలోని మిషన్ అనాలసిస్ డివిజన్‌లో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆమె వివిధ ప్రాజెక్టుల్లో తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. 2007లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ చేతుల మీదుగా 'ఇస్రో యంగ్ సైంటిస్ట్' అవార్డు అందుకున్నారు.

అంగారక గ్రహం మీద పరిశోధనల కోసం మన దేశం చేపట్టిన 'మిషన్ మంగళ్‌యాన్'కు డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. "మంగళ్‌యాన్‌కు పని చేసిన పద్దెనిమిది నెలలూ ఎంతో ఒత్తిడి ఉండేది. తెల్లవారుజాము నాలుగు గంటల వరకూ పని చేసేదాన్ని. అప్పట్లో నా పిల్లలిద్దరూ చాలా చిన్న వాళ్ళు. కానీ నా వృత్తి బాధ్యతలు ఎలాంటివో వాళ్ళు అర్థం చేసుకున్నారు. ఇల్లు, పిల్లల విషయంలో నా భర్త అవినాష్ శ్రీవాత్సవ ఎంతో అండగా ఉండడం వల్లే ఇవన్నీ సాధ్యపడ్డాయి. ఇస్రోలో అనేక ముఖ్యమైన ప్రాజెక్టులకు పనిచేసే అవకాశం నాకు వచ్చింది. కానీ మంగళయాన్ అన్నిటికన్నా ప్రత్యేకం. అది నా ఆకాంక్షలెన్నిటినో నెరవేర్చింది" అంటారామె.

ఆ ప్రాజెక్ట్ ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. పలు సంస్థలు ఆమె కృషిని గుర్తించి సత్కరించాయి. ఆ తరువాత 2019లో 'చంద్రయాన్-2'ను మిషన్ డెరెక్టర్‌గా ఆమె పర్యవేక్షించారు. ఇప్పుడు 'చంద్రయాన్-3'కి మిషన్ డైరెక్టర్‌గా వ్యవహరించి... మరోసారి వార్తల్లో నిలిచారు. 'రాకెట్ ఉమన్ ఆఫ్ ఇండియా'గా ప్రశంసలు పొందుతున్నారు. ఇస్రో టీమ్ అవార్డ్, ఎఎసఐ టీమ్ అవార్డ్, 'సొసైటీ ఫర్ ఇండియా ఏరోస్పేస్ టెక్నాలజీ అండ్ ఇండస్ట్రీస్' నుంచి ఏరోస్పేస్ ఉమన్ అవార్డ్... ఇలా ఎన్నో పురస్కారాలను ఆమె అందుకున్నారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ■

గుండెల్లో రగిలే కోపం బుర్రను పొగచూరేలా చేస్తుంది

# శ్రీజ మిల్క్ డైరీ 10వ వార్షికోత్సవ సంబరాలు

శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధి తిరుపతి కేంద్రంగా నడుస్తున్న శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ 9 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా జులై 10న గ్రామాల్లో 10వ వార్షికోత్సవ సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.

ఇందులో భాగంగా సత్యసాయి జిల్లా గోరంట్ల పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని చలివేందుల గ్రామాలలో శ్రీజ ఏరియా ఆఫీసర్ కురబ మల్లికార్జున ఆధ్వర్యంలో 10వ వార్షికోత్సవ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గోరంట్ల ఏరియా ఆఫీసర్ మల్లికార్జున మాట్లాడుతూ గోరంట్ల ఏరియా మొత్తానికి 42లక్షలు ప్రోత్సాహక రుసుం చెల్లించడం జరిగిందన్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో క్రమం తప్పకుండా 200 రోజులు 500 లీటర్లు పాలు సరఫరా చేసిన శ్రీజ పాడి రైతులకు ఈ ప్రోత్సాహక రుసుమును వారి యొక్క వ్యక్తిగత ఖాతాలలో జమ చేయడంతో పాటు ఐదు లీటర్ల స్టీల్ పాలకాను ఇవ్వడం జరుగుతుందన్నారు.

2014వ సంవత్సరంలో కేవలం 27 మంది మహిళా పాడి రైతులతో మొదలైన శ్రీజ కంపెనీ ప్రస్థానం నేడు లక్ష మందికి పైగా మహిళా సభ్యులను చేర్చుకొని ఒక మహిళా శక్తిగా ఏర్పడిందన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా, ప్రతి విషయంలోనూ పారదర్శకతను పాటిస్తూ నాణ్యమైన పాలను సేకరిస్తూ ఇటు వినియోగదారులకు, అటు పాడి రైతులకు తమదైన శైలిలో సేవలందిస్తోందన్నారు.

నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ ఎన్ డి డి బి వారి సహకారంతో వందకు వందమంది మహిళా సభ్యుల పాడి రైతులను యజమానులుగా చేసి వచ్చిన లాభాలను వారికే చెల్లిస్తున్న ఏకైక సంస్థ శ్రీజ అని పేర్కొన్నారు. అంతేకాకుండా పాడి రైతులకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ అవసరమైన పశువుల దాణ, మినరల్ మిక్చర్, పశువైద్యశిబిరాలు, వంటి వాటిని తక్కువ ధరలకు అందిస్తుందని అన్నారు. పాడి వ్యవస్థపై గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చెందే విధంగా శ్రీజ కంపెనీ పాడి రైతులకు సహకరిస్తోందన్నారు. ఎన్నో ఆటంకాలను అధిగమించి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని నేడు 10వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా మహిళా పాడి రైతులకు 10 కోట్ల రూపాయలతో పాటు 5 లీటర్ల స్టీల్ పాల క్యాన్లను అందివ్వడ ఆనందంగా ఉందన్నారు.

శ్రీజ కంపెనీ ఇటువంటి వార్షికోత్సవాలను మరెన్నో జరుపుకోవాలని సూపర్ వైజర్ వి. నారాయణ స్వామి పాడి రైతులకు మరిన్ని సేవలు అందించే దిశగా ముందుకు వెళ్లాలని ప్రతి ఒక్క పాడి రైతు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీజ ఉద్యోగులు వి. నారాయణ స్వామి పి.ఐ. బి. ఎగ్జిక్యూటివ్ డాక్టర్ మారుతి ప్రసాద్, సురేష్ డాక్టరు ప్రశాంత్ గారు, రంగారెడ్డి, పాడి రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ■

# ఎఫ్ పి ఓల సుస్థిరతకు శ్రీ సి ఎస్ సూచనలు






ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి జులై 10వ తేదీన వాల్మీకిపురం, నిమ్మనపల్లె , మర్యాదరామన్న పట్నం ఎఫ్ పి ఓ లు నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రాలను సందర్శించి, వాటి వ్యాపార కార్యక్రమాలను పరిశీలించి, ఎఫ్ పి ఓ ల సుస్థిరతకు క్రింది సలహాలు, సూచనలు చేశారు.

- ఎఫ్ పి ఓలు వ్యాపార సంస్థలుగా ఎదుగుతూ సభ్య రైతులకు నాణ్యమైన సేవలు అందించాలి.
- ప్రతి ఎఫ్ పి ఓ తన వ్యాపార లావాదేవీలను తగిన సాఫ్ట్‌వేర్ ద్వారా కంప్యూటరులో నమోదు చేసుకుంటూ ఉండాలి. అందరూ ఒకేరకముగా యం ఐ ఎస్ ను అమలుచేస్తే , డూప్లికేషను కాకుండా ఉంటుంది. దానికి తగిన సలహాలు సూచనలు ఏపిమాస్ సిబ్బంది ఇవ్వగలరు.
- రైతు సేవా కేంద్రంలో ఎప్పటికప్పుడు స్టాకును పరిశీలిస్తూ ఉండాలి. ఒక సంవత్సరానికి పైగా అమ్ముడుకాని సరుకులను గుర్తించి. వాటిపై సకాలములో నిర్ణయం తీసుకోవాలి. వాటిని కొంత ధర తగ్గించి అమ్మడమో లేదా సప్లయి చేసినవారికే తిరిగి ఇచ్చివేయడమో చేయాలి.
- చాలామంది ఎఫ్‌పిఓ సిఇఓ లు ఆఫీసులోనే ఉంటూ ఇన్పుట్ అమ్మకాలు మాత్రం చూస్తున్నారు. వీరు దానితోపాటు సమిష్టి మార్కెటింగ్ పైన దృష్టిపెట్టాలని, క్షేత్రసందర్శనల ద్వారా రైతులకు అందుబాటులో ఉండి, ఉత్పాదక పెరుగుదలకు కూడా కృషి చేయాలి.
- ఎఫ్‌పిఓల ద్వారా నిర్మించబడిన కొనుగోలు కేంద్రాలను సక్రమంగా ఉపయోగించుకొని, రైతులు పండించే పంటలను సమిష్టి మార్కెటింగ్ ద్వారా అమ్మించి గిట్టుబాటు ధర వచ్చేలా కృషి చేయాలి.
- ప్రతి ఎఫ్ పి ఓ వారికి కావలసిన ఉత్పాదకాల గురించి, 6 నెలలకు అవసరమైనంత ముందుగానే డిమాండును తయారుచేసుకుని, మార్క్‌ఫెడ్ వారితో మాట్లాడితే మనకు ఎరువుల కొరత ఉండదు. మార్కెటింగ్ టీమ్ దీనిపై కృషిచేయాలి.
- నెలవారీ , సంవత్సరవారీగా ఎఫ్‌పిఓలు చేయాల్సిన చట్టపరమైన చర్యలను ఆడిటరు కాకుండా ఫెడరేషన్ చేపడితే, ఫెడరేషన్‌కు కూడా కొంత ఆదాయం వచ్చే వీలుంటుంది.
- వ్యాపార ప్రణాళికలను చక్కగా చేసికొని ఎఫ్‌పిఓలు ఇతర ఆర్థిక సంస్థలతో అనుసంధానమై సభ్యులకు నాణ్యమైన సేవలందిస్తే సభ్యుల ఆదాయము పెరగడమే కాకుండా, సంస్థలు కూడా సుస్థిరముగా నడవగలవు అని శ్రీ సిఎస్ రెడ్డి సలహాలు ఇవ్వడం జరిగినది.

ఎఫ్‌పిఓ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, ఏపిమాస్ ప్రాజెక్టు మేనేజర్లు ఏపిమాస్ సిఇఒ సూచనలను పాటించి ఎఫ్‌పిఓల సుస్థిరతకు తమ వంతు కృషి చేయగలమని చెప్పారు. ■

**మార్పును తిరస్కరించేవాడు వినాశనం కోరుకునేవాడే ; అభివృద్ధి కోరుకోనిది ఒక్క శ్మశానం మాత్రమే !**

# ఉద్యోగినులు లక్ష్యంగా ఈ ఏడాది తల్లిపాల వారోత్సవాలు !

ఉద్యోగస్తులైన తల్లిదండ్రులు తమ పిల్లలకు తల్లిపాలను కొనసాగించేలా సహకరిద్దాం

ఆగస్టు 01 నుంచి 07 వరకు వారోత్సవాలు

**త**ల్లిపాలు ఇవ్వడం అన్నది తల్లీబిడ్డల ఇద్దరి హక్కు. మన దేశంలో ఉద్యోగినులైన తల్లులు ఉద్యోగం చేసుకుంటూ తమ పిల్లలకు తల్లిపాలు కొనసాగించడం ఒక సవాలుగా ఉంటోంది. గృహిణిగా , ఉద్యోగినిగా జంట బాధ్యతలను సమతుల్యం చేసుకుంటూ పోవటం ఒక యుద్ధ ప్రక్రియ అవుతోంది.

ఈ సంవత్సరం తల్లిపాల వారోత్సవాలలో ప్రధానంగా ప్రసూతి ప్రయోజనాలపై చర్చింపబడుతుంది.

**తల్లిపాల వారోత్సవాల సందేశం**

'ఉద్యోగస్తులైన తల్లిదండ్రులు తమ పిల్లలకు తల్లిపాలు కొనసాగించేందుకు సహకరిద్దాం' అనేది ఈ సంవత్సరం తల్లిపాల వారోత్సవాల సందేశం.

**తల్లిపాల వారోత్సవాల లక్ష్యాలు**

తల్లిపాల సంస్కృతి పరిరక్షణకు ప్రస్తుతం మన దేశంలో వున్న ప్రభుత్వ విధానాలు సంబంధిత కార్యక్రమాలను వివరిస్తూ వాటిని మరింత చక్కగా అమలుకు తీసుకు రావడానికి ప్రభుత్వం, పౌరసమాజం తీసుకోవాల్సిన చర్యల గురించి విపులంగా వివరించడం జరుగుతుంది.

- ఆరోగ్య కేంద్రాలలో, పని ప్రదేశాలలో మహిళా ఉద్యోగినులకు మద్దతుకై దేశవ్యాప్తంగా విస్తృత అవగాహనా చర్యలు
- ప్రసూతి అర్హతలు , ఇతర సహాయక చర్యల సమాచారాన్ని తెలియపరచడం.
- ఈ దిశగా, ఉద్యోగినులను ప్రోత్సహించే ప్రస్తుత కార్యక్రమాలను బలోపేతం చేయడం.

**ప్రసూతి రక్షణ: ప్రసూతి ప్రయోజన చట్టం**

ప్రసూతి ప్రయోజన (సవరణల) చట్టం 2017 ప్రకారం ఉద్యోగస్తులైన మహిళలకు ప్రసూతి ప్రయోజనాలు లభిస్తాయి. యీ విషయం ప్రతి ఒక్కరికి తెలియపరచవలసి ఉన్నది. చట్టం యావత్ భారతదేశానికి వర్తిస్తుంది.

- ఇందులో 26 వారాల పూర్తి జీతంతో కూడిన ప్రసూతి సెలవు లభిస్తుంది.
- గనులు, తోటపనులు, దుకాణాలు, సంస్థలు, కర్మాగారాలలో పనిచేస్తున్న మహిళలందరికి వర్తిస్తుంది.
- సంఘటిత మరియు అసంఘటిత రంగాలలో పని చేయుచున్న మహిళలందరికి వర్తిస్తుంది.
- కాంట్రాక్ట్ ఉద్యోగినులకు కూడా వర్తిస్తుంది.
- కనీసం 50 మంది ఉద్యోగులు పని చేస్తున్న ప్రతి సంస్థలోను పిల్లల సంరక్షణకు క్రెష్ సౌకర్యం కల్పించవలసి వుంది.
- యాజమాన్యం, ఉద్యోగులు పరస్పర అంగీకారంతో ప్రసూతి సెలవు తర్వాత కూడా నిర్ణీతకాలం ఇంటి నుంచి పనులు నిర్వహించే వెసులుబాటు వుంది.

పైన వివరించిన సౌకర్యాలు కల్పించని సంస్థలపై చట్ట ఉల్లంఘన కింద చర్యలు తీసుకునే అధికారం వుంటుంది..

**ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం**

ఈ పథకం అసంఘటిత రంగంలో పని చేస్తున్న మహిళలకు, సాధారణ గృహిణులకు వర్తిస్తుంది. తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని , పోషణను దృష్టిలో వుంచుకొని ఈ పథకంలో మొదటి 2 కాన్పుల వరకు 2 విడతలుగా 5 వేల రూపాయల నగదు వారి బ్యాంకు లేక పోస్టాఫీసు ఖాతాలో జమ చేయబడుతుంది. కొన్ని నిబంధనలను అనుసరించి ఈ సౌకర్యం అందించడం జరుగుతున్నది.

**సవాళ్ళు**

ఉద్యోగిని అయిన తల్లి తన బిడ్డ పుట్టినప్పటి నుండి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించడం, చాలా కష్టతరంగా వుంటోంది.

- గర్భిణీ సమయం, ప్రసవ సమయంలో తగిన సహకారం లేకపోవడం - ప్రసూతి అర్హతలపై అవగాహన లేకపోవడం.
- ఆందోళనకు గురిచేసే విపరీత వ్యాపార ధోరణి ప్రకటనలు
- సంఘటిత రంగంతో పోల్చుకున్నట్లయితే అసంఘటిత రంగంలో పని చేస్తున్న మహిళలకు తగినంత సహకారం లభించకపోవటం
- నిర్దేశించిన విధంగా పనిచేస్తున్న సంస్థలలో క్రష్ సౌకర్యం లేకపోవడం
- ఆశించిన రీతిలో కుటుంబ సభ్యుల సహకారం లేకపోవడం.

**శిశు పోషకాహార చట్టం**

(తల్లి పాల ప్రత్యామ్నాయాలు, పాల బాటిళ్ళు , శిశు ఆహార ఉత్పత్తి, పంపిణీ, సరఫరా క్రమబద్ధీకరణ చట్టం)

ఈ చట్ట ప్రకారం పరిశ్రమల వారు రెండు సంవత్సరాల లోపు పిల్లలకు ఏ ఇతర ఆహార పదార్థాలు , పాల బాటిళ్ల ప్రోత్సాహక ప్రకటనలు యివ్వడం, ఆహార ఉత్పత్తులపై తల్లీబిడ్డల బొమ్మలు, గ్రాఫిక్ బొమ్మలు ముద్రించటం, ఆరోగ్య కార్యకర్తలకు, వారి సంఘాలకు ఆర్థిక సహకారాన్ని అందించటం, తల్లిదండ్రులకు బహుమతులివ్వటం నిషేధం.

**జాతీయ భద్రతా చట్టం 2013**

ఈ చట్టప్రకారం మహిళలకు ....

- గర్భిణీ దశ నుంచి ప్రసవించిన ఆరు నెలల వరకు ఒక పూట బలవర్ధకమైన భోజన సౌకర్యం లభిస్తుంది.
- కొన్ని నిబంధనలకు లోబడి ప్రసూతి ప్రయోజనంగా రూ. 6వేల నగదు విడతల వారీగా అందించబడుతుంది.
- ఆరు నెలల నుండి ఆరు సంవత్సరాల వయస్సు వరకూ పిల్లలకు ఒక పూట అనువైన బలవర్ధకమైన ఆహార సౌకర్యం లభిస్తుంది.
- పుట్టినప్పటి నుండి ఆరు నెలల వయస్సు వరకు పిల్లలకు తల్లిపాలు ప్రోత్సహించబడుతుంది.

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించడాన్ని, రెండు సంవత్సరాల లోపు పిల్లల పోషణా పద్ధతులను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త మార్గదర్శకాలతో అమలు చేస్తున్నది.

- 2006వ సంవత్సరంలో జాతీయ చిన్నపిల్లల పోషణా విధానం తీసుకురావడం జరిగింది.
- 2013లో పై విధానాన్ని బలపరుస్తూ మార్గదర్శకాలు
- 2016 లో ప్రసూతి ఆసుపత్రులలో తల్లిపాల ప్రోత్సాహానికి “మా” అనే ఒక ప్రత్యేక పథకం
- 2017లో తల్లిపాల బ్యాంకు నిర్వహణ మార్గదర్శకాలు తీసుకురాబడినది.

**కార్యాచరణ పద్ధతులు**

- తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించే మెలుకువలపై మాతా శిశు ఆసుపత్రులలోని వైద్య సిబ్బందికి , నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం
- 2016 “మా” కార్యక్రమాన్ని ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రులలో పటిష్ఠంగా అమలుపరుస్తూ, ప్రైవేట్ ప్రసూతి ఆసుపత్రులకు కూడా విస్తరించడం
- ప్రసూతి కేంద్రాలలో తల్లిపాల సూచికలను పర్యవేక్షించడం.
- వైద్య విధ్యార్థులు, నర్సింగ్ విద్యార్థుల పాఠ్యాంశాలలో తల్లిపాల బోధనకు ప్రాధాన్యత ఇవ్వడం
- ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం బిపిఎన్ఐ సంస్థ వారు భారతదేశంలోని ప్రైవేటు ఆసుపత్రుల అసోషియేషన్‌తో (ఎహెచ్‌పిఐ) కలిసి రూపొందించిన ‘తల్లిపాల మైత్రి – ఆసుపత్రుల పథకాన్ని’ అన్ని మాతా శిశు కేంద్రాలలో అమలుచేయడం
- ప్రసూతి ప్రయోజన సౌకర్యాలు తెలియపరచడం
- అన్ని సంస్థలు , కార్యాలయాలు శిశుమైత్రి అంశాలు పాటించేలా చేయటం
- శిశు ఆహార చట్టం పటిష్ట అమలుకు కృషి చేయడం ■

ఆశాభావం అంటే సమస్యలలో పరిష్కారాన్ని , ఆటంకాలలో అవకాశాలను చూడగలిగేలా చేసేది

# బిడ్డలకు పాలిచ్చే గదుల ఏర్పాటుకోసం ఓ తల్లి పోరాటం!

**మరుగుదొడ్లో కూర్చొని మనం తినగలమా? మరి అలాంటప్పుడు తల్లులు తమ పిల్లలకు బహిరంగ ప్రదేశాల్లో పాలివ్వడానికి పబ్లిక్ టాయిలెట్లకు ఎందుకు వెళ్లాలి? సిగరెట్ తాగడం కోసం స్మోకింగ్ జోన్లు ఏర్పాటు చేస్తారు. కానీ, ఆకలితో ఉన్న పిల్లలకు పాలివ్వడానికి ప్రతిచోటా బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్‌లు ఎందుకు లేవు? అందరి ముందు తమ బిడ్డకు పాలిచ్చే తల్లులు ప్రజల చెడు దృష్టిని ఎందుకు ఎదుర్కోవాలి?**

**ఢి**ల్లీవాసి, న్యాయవాది నేహా రస్తోగి ఈ సమస్యల నుండి తల్లులను రక్షించడానికి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా పింక్ టాయిలెట్లు, పిల్లలకు తల్లిపాలు ఇచ్చే గదులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ ఆమె ఈ దిశగా తన ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉంది. ప్రజల్లో అవగాహన కలిగిస్తూనే ఉంది. ఇంతకీ నేహా రస్తోగి తల్లిపాల ఆలయాలు ఎందుకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. దీని ద్వారా ఆమె ఏం సాధిస్తోంది. లాయర్‌గా ఆమె పోరాటం దేనికి?



ముందుగా తను ఎదుర్కొన్న సమస్యను వివరిస్తూ.... "నేను 2017, అక్టోబరులో మొదటిసారి తల్లిని అయ్యాను. నా బాబుకి మూడు నెలల వయసున్నప్పుడు బెంగళూరు వెళ్లాల్సి వచ్చింది. ఢిల్లీ నుంచి బయల్దేరాలి. గంటలు గంటల ట్రాఫిక్ తాకిడిని తప్పించుకుంటూ విమానాశ్రయానికి చేరుకునేసరికి బాబు ఆకలితో ఏడుపు మొదలెట్టాడు. అక్కడ వాడికి పాలు ఎక్కడ ఇవ్వాలో తెలియలేదు.

**వాష్ రూమ్‌లో తల్లి పాలు**

తల్లిపాలు పట్టేందుకు విమానాశ్రయంలోని వాష్ రూమ్‌కి వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫ్లైట్లో వాడికి మరోసారి ఆకలి వేసింది. పక్కన కూర్చున్న వ్యక్తిని 'బిడ్డకు పాలు పట్టాలి, కొద్దిగా స్థలం ఇవ్వమని అడిగాను. కానీ, అతను కాదన్నాడు. ఎయిర్‌హోస్టెస్‌ను అడిగితే "టాయ్‌లెట్‌కు వెళ్లు' అని చెప్పింది. చాలాసేపు ప్రాధేయపడ్డాక ఎయిర్‌హోస్టెస్ కూర్చున్న చోట కూర్చుని, పిల్లవాడికి పాలు పట్టాను. బెంగళూరు విమానాశ్రయంలోనూ బిడ్డకు తల్లి పాలు పట్టేందుకు చోటు లేదు. అలా బిడ్డతో నా మొదటి ప్రయాణం వ్యవస్థ నిర్లక్ష్యం కారణంగా చాలా బాధాకరంగా అనిపించింది. గంటల తరబడి నా కొడుకు ఆకలితో ఏడుస్తూ ఉంటే, నేను నిస్సహాయంగా ఉండిపోయాను.

**విషయ సేకరణ**

ఈ సంఘటన తర్వాత నేను దేశవ్యాప్త సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డాను దేశంలో ఎక్కడా చంటి బిడ్డలకు తల్లిపాలు పట్టే గదులు లేవని తెలిసింది. ఈ విషయంపై చాలా మంది మహిళలతో మాట్లాడి, వారి బాధాకరమైన అనుభవాలను విన్నాను. నాలాంటి తల్లులకు బహిరంగ ప్రదేశాల్లో పాలిచ్చే హక్కును కల్పించాలని, అందుకు ఎంత కాలం యుద్ధం చేసినా పర్వాలేదని నిర్ణయించుకున్నా.

అదే సమయంలో ఓ ఎంపీ కూడా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతానని హామీ ఇచ్చారు. అప్పుడే ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ ఈ కేసు విచారణ సందర్భంగా దేశవ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో చంటిబిడ్డలకు తల్లిపాలు ఇచ్చే ఏర్పాట్లు లేనే లేవని

తెలుసుకొని ఆశ్చర్యపోయారు. రైల్వేస్టేషన్, బస్టాప్, ఎయిర్‌పోర్ట్, మాల్స్ సహా ప్రతి బహిరంగ ప్రదేశాల్లో తల్లిపాల బూత్‌లు ఏర్పాటు చేయాలని కోర్టును కోరాను. తల్లులు పనిచేసే ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కూడా ఈ సదుపాయాన్ని కల్పించాలన్నాను.

**లైంగిక వేధింపులు**

బిడ్డలకు చనుబాలివ్వడానికి గదులు అందుబాటులో లేకపోవడంతో తల్లులు రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే తమ పిల్లలకు పాలివ్వాల్సి వస్తోంది. ఈ సమయంలో వారు లైంగిక వేధింపులను కూడా ఎదుర్కోవాల్సి వస్తోంది. తల్లి గౌరవాన్ని దెబ్బతీసే వారు ఆమెను గౌరవంగా చూడరు. కంప్లైంట్ చేస్తే టాయ్‌లెట్లో కూర్చొని పాలు ఇవ్వమని సలహా ఇచ్చే వారున్నారు. కానీ, అటువంటి మురికి, దుర్వాసన ఉన్న ప్రదేశంలో కూర్చొని పాలు ఇవ్వడం తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యానికి ప్రమాదకరం.

ఈ సమస్యకు సంబంధించి అన్ని శాఖలు, ఏజెన్సీలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2019లో నిర్ణయం తీసుకుని, తల్లి పాలిచ్చే గదులను (ఫీడింగ్ రూమ్‌లను) ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సదుపాయాన్ని కల్పించాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు, దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు పంపారు.

హైకోర్టు తీర్పు తర్వాత చైనా, అమెరికా, లండన్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మీడియా దానిని కవర్ చేసింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంలో కనీస సౌకర్యాలు కూడా లేవని పెద్ద ఎత్తున చర్చ జరిగింది.

హైకోర్టు నిర్ణయం తర్వాత పింక్ టాయిలెట్, బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్ ప్రారంభమైంది. ఇందులో తల్లులకు ప్రత్యేక భోజన గదులు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ తల్లి హాయిగా కూర్చొని బిడ్డకు పాలు పట్టవచ్చు. స్నానం చేసి, బట్టలు కూడా మార్చుకోవచ్చు. ఢిల్లీలో కన్నాట్ ప్లేస్‌లోని పార్లమెంట్ స్ట్రీట్‌లో మొదటి ఫీడింగ్ రూమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో 700కు పైగా పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.

**ఆలయాల నుండి...**

షిర్డీలో సాయిబాబా ఆలయం నుండి తాజ్‌మహల్ వరకు తల్లిపాలు ఇచ్చే గదులు నిర్మించారు. బస్టాప్‌లు, రైల్వే స్టేషన్లలో తల్లి పాల క్యాబిన్లు ప్రారంభించారు. ఇప్పుడు రైల్వేస్టేషన్లలోనే కాదు రైళ్లలో కూడా ప్రత్యేక ఫీడింగ్ క్యాబిన్లను తయారు చేస్తున్నారు. ఈ విజయం ప్రభావం దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ కనిపించింది.

**తల్లి పాల బ్యాంక్**

దేశంలో ఏ ఒక్క తల్లీ బిడ్డ కూడా.. బహిరంగ ప్రదేశాల్లో ఫీడింగ్ సమస్యను ఎదుర్కోకూడదు. ఈ ఆలోచనతో అవ్యన్ ఫౌండేషన్ 'మాతృ స్పర్శ్ ఇనిషియేటివ్' పేరుతో ఒక ఎన్జీవోని ప్రారంభించాను. దీని ద్వారా ఫీడింగ్ రూమ్, తల్లి పాల బ్యాంకు సౌకర్యాన్ని కల్పించే ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాను. ఇప్పుడు చాలామంది తల్లిపాలు కావాలనే వాళ్లు కూడా సంప్రదిస్తున్నారు. దీంతో తల్లిపాలను దానం చేయాలను కుంటున్న తల్లుల నుంచి పాలు తీసుకొని, అవసరమైన పిల్లలకు ఇస్తుంటాం. ఈ పనిలో ప్రభుత్వాలు చొరవ తీసుకుంటే, ప్రతిబిడ్డ తల్లిపాలు సులభంగా పొందుతుంది. ఆ దిశగానే ఇప్పుడు నేను ప్రయత్నిస్తున్నాను.

లండన్ యూనివర్శిటీలో జరుగుతున్న పరిశోధనలో నేను వాదించిన తల్లిపాల కేసు చేర్చారు. కేవలం తొమ్మిది నెలల వయసులో పిల్ దాఖలు చేసినందుకు నా కొడుకు అవ్యన్ పేరు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. రొమ్ము లైంగిక అవయవం కాదు. ఇది తల్లి–బిడ్డల మధ్య పవిత్ర సంబంధాన్ని కలిగిస్తుంది. ఈ పోరాటం అంత సులువు కాలేదు. మాది చిన్న కుటుంబం, నా కొడుకు సిజేరియన్ ద్వారా పుట్టాడు. ఈ పోరాటంలో నేను ఆపరేషన్ నుండి చాలా రోజుల వరకు కోలుకోలేకపోయాను. ఇంటి నుండి కోర్టు పనులు పూర్తయ్యే వరకు పిల్లాడిని పట్టుకొనేదాన్ని. సమాజంలో పాతకాలపు ఆలోచనలను మార్చడం పెద్ద సవాల్. ఎంతోమంది మహిళలు కూడా ఎన్ని ఇబ్బందులు పడినా మాట్లాడలేకపోతున్నారు" అంటూ ఈ సమస్య గురించి సుదీర్ఘంగా తన గళం వినిపిస్తారు ఈ లాయర్. ■

లేనిదాని గురించి కుంగిపోకుండా వున్నదానితో సంతృప్తిగా, ప్రశాంతంగా జీవించడమే ఆనందం

# జీవనోపాధుల బలోపేతం

ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు

డైరీఫాం, పౌల్ట్రి




పందిళ్ళపై
కూరగాయల సాగు



బహుళ
పంటల సాగు







పెరట్లో కూరగాయల
పెంపకం



చిరు ధాన్యాల సాగు



చిరు ధాన్యాల ప్రాసెసింగ్

NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-08-2023 ; Posting Date: 05 & 06-08-2023

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

## ఏపిమాస్ 22 వ వార్షికోత్సవ సంరంభం ... మరికొన్ని దృశ్యాలు



వేదికపై ఏపిమాస్ పాలకవర్గ సభ్యురాళ్ళు మహపర అలి గారు, గౌరి గారు, సోషల్ వెంచర్‌కు చెందిన పాపారావు గారు, డాక్టర్ సుబ్బారావు గారు, సి ఎస్ రెడ్డి గారు ... సామూహిక ఆత్మీయ బంధం ... హైదరాబాదు ఐఐటి డైరెక్టర్ డాక్టర్ బి ఎస్ మూర్తిగారికి స్వాగతం



చౌడేపల్లి బి గంగమ్మ మహిళా ఎఫ్ పి ఓ ప్రథమ వార్షిక మహాసభ దృశ్యం



కలికిరి ఎఫ్ పి ఓ నాల్గవ వార్షిక మహాసభ దృశ్యం



నాగలాపురం ఎఫ్ పి ఓ రెండవ వార్షిక మహాసభ , పెద్దవడుగూరు మహిళా ఎఫ్ పి ఓ ఐదవ వార్షిక మహాసభ దృశ్యాలు ..
ధరణి ఎఫ్ పి ఓ ను సందర్శించిన ఇథియోపియా డెవలప్‌మెంట్ బ్యాంక్ బృందం

To ADDRESS



ఆర్ పి లకు వాష్ శిక్షణలో ప్రసంగిస్తున్న జగిత్యాల ఎం ఎల్ ఏ డాక్టర్ సంజయ్ కుమార్

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089